thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 127| జగిత్యాల | శనివారం 08 ఆగస్టు, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## లంకబ్యాటర్ల దంచికొట్టుడు



11

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం



4

- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

## అమిత్‌షాతో రాజీనామా చేయించండి

- మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్
- జెన్‌జీపై ప్రేమ మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి
- విద్యార్థులపై అణచివేతను ఎందుకు ఖండించలేదు?
- ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని ఆరోపణ



4

## ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

### ఎన్డీఏ ఎంపీలకు మోదీ భరోసా

- కూటమిలో ప్రతి ఎంపీకి సమాన గౌరవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించండి
- పార్లమెంట్‌లో అంతరాయాలతో కొత్త ఎంపీలకు అవకాశం దక్కడం లేదని ఆవేదన



4



# జీఎస్టీ ఆదాయం పెంపునకు ఏఐ అస్త్రం

- పన్ను లీకేజీలకు సాంకేతికతతో చెక్
- శాఖల సమాచారం ఒకే వ్యవస్థలోకి
- వ్యాపారులకు ఇబ్బందులు లేకుండానే రాబడి పెంపు
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం రేవంత్ విస్తృత చర్చలు

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధను ప్రధాన అస్త్రంగా వినియోగించనుంది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల లీకేజీలను గుర్తించి అరికట్టేందుకు ఏఐ ఆధారిత సమీకృత వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, సులభతర వాణిజ్య విధానానికి ఆటంకం లేకుండానే ప్రభుత్వ ఆదాయం పెరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడం, ఆదాయ వనరులను పెంచడం, పన్నుల వసూళ్లలో లోపాలను సరిదిద్దడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

- హైదరాబాద్, ఆగస్టు 7

## హైదరాబాద్‌కు మరో మెగా బస్ టెర్మినల్



- గాజులరామారంలో 100 ఎకరాల్లో నిర్మాణం
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సులకు వేర్వేరు టెర్మినళ్లు
- ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రం
- నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

2

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో అధికారికంగా వెల్లడించారు. ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 7

## వానల కోసం 'వరుణ' యాగం



- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 10న నాగార్జునసాగర్‌లో మహా క్రతువు
- 108 మంది రుత్వికులు.. 11 హోమకుండాలు
- పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్

2

## సామూహిక లైంగికదాడి



2

- దృశ్యాలు చిత్రీకరించి బెదిరింపులు
- వీడియోలు బయటపెడతామంటూ బ్లాక్‌మెయిల్
- నలుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్
- కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

## నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా!

- భార్య ఫోన్‌లో సందేశాలు చూసి భర్త షాక్
- ప్రియుడితో కలిసి హత్యకు కుట్ర పన్నిందని ఆరోపణ
- వెంటాడినట్లు ఫిర్యాదు..
- తప్పించుకుని ఇంటికి చేరిన భర్త
- డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

2





## తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

- జీఆర్ఎంబీ అజెండాలోని మూడు అంశాలను ఉపసంహరించాలి
- కేంద్ర జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ

3

## స్వాతంత్ర్య వేళ 'స్మార్ట్' రేషన్ కార్డులు

- 15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త కార్డుల పంపిణీ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు.

2





## అధికారులను కోర్టుకు పిలిపించడం బాధాకరం

- ప్రభుత్వాలు చేసిన తప్పులతోనే అధికారులకు ఈ పరిస్థితి
- ఉచిత పథకాలతో రాష్ట్ర ఖజానాపై తీవ్ర భారం
- సంపన్నులు, అధికారులు రైతుబంధు తీసుకోవడం బాధాకరం
- సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

3



# వానల కోసం 'వరుణ' యాగం

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
## 10న నాగార్జునసాగర్‌లో మహా క్రతువు
## 108 మంది రుత్వికులు.. 11 హోమకుండాలు
## పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 7:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు జలకళ సంతరించుకోవాలని, జలాశయాలు నిండాలని, పంటలు సమృద్ధిగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం మహా వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో జరిగే ఈ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఎల్‌నినో ప్రభావం నుంచి రాష్ట్రానికి ఉపశమనం కలగడంతో పాటు కృష్ణా, గోదావరి నదుల్లో సమృద్ధిగా జలాలు ప్రవహించాలన్న ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపట్టనున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి తెలిపింది. రైతాంగ శ్రేయస్సు, రాష్ట్ర సుభిక్షాన్ని కాంక్షిస్తూ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

### 108 మంది రుత్వికులతో మహా క్రతువు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు వరుణ యాగంలో పాల్గొననున్నారు. ఇందుకోసం విజయ విహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమకుండాలను ఏర్పాటు చేయనున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా యాగ క్రతువును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని, పంటలు బాగా పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

### పూర్ణాహుతికి సీఎం రేవంత్

యాగం ముగింపు సందర్భంగా నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నారు. వేద పండితులు, అర్చకులు, రుత్వికులకు అవసరమైన ఏర్పాట్లతో పాటు యాగ ప్రాంగణంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కృష్ణా, గోదావరి నదులు జలకళతో కళకళలాడాలని, తెలంగాణ రైతాంగం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో వరుణ యాగాన్ని చేపడుతున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి ప్రకటించింది.

# జీఎస్టీ ఆదాయం పెంపునకు 'ఏఐ' అస్త్రం

- పన్ను లీకేజీలకు సాంకేతికతతో చెక్
- శాఖల సమాచారం ఒకే వ్యవస్థలోకి
- వ్యాపారులకు ఇబ్బందులు లేకుండానే రాబడి పెంపు
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం రేవంత్ విస్తృత చర్చలు



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధను ప్రధాన అస్త్రంగా వినియోగించనుంది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల లీకేజీలను గుర్తించి అరికట్టేందుకు ఏఐ ఆధారిత సమీకృత వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, సులభతర వాణిజ్య విధానానికి ఆటంకం లేకుండానే ప్రభుత్వ ఆదాయం పెరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడం, ఆదాయ వనరులను పెంచడం, పన్నుల వసూళ్లలో లోపాలను సరిదిద్దడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

### జీఎస్టీ అధికారులకు ఏఐ సమాచారం

జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. జీఎస్టీ అధికారులకు అవసరమైన సమాచారాన్ని ఏఐ ఆధారంగా సులభంగా అందించే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. పన్ను ఎగవేత, ఆదాయ లీకేజీలను గుర్తించేందుకు సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఈ ప్రక్రియలో వ్యాపారులకు అనవసరమైన తనిఖీలు, ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాకు రాబడిని పెంచుతూనే సులభతర వాణిజ్య విధానాన్ని మరింత మెరుగుపరిచేలా సాంకేతికత వినియోగం ఉండాలని అరవింద్ సుబ్రమణియన్ సూచించారు.

### శాఖల మధ్య సమన్వయంతో లీకేజీలకు చెక్

పన్నుల లీకేజీలను అరికట్టడంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా భవన నిర్మాణాలు, నిర్మాణ సామగ్రికి సంబంధించిన పన్నుల విషయంలో మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని ఏఐ సాయంతో అనుసంధానం చేయాలని చెప్పారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే దశలోనే వాటికి అవసరమయ్యే నిర్మాణ సామగ్రి వివరాలను నమోదు చేయాలని సూచించారు. దాని ఆధారంగా ఎంత పన్ను రావాల్సి ఉంటుందో ముందుగానే అంచనా వేసే వ్యవస్థను రూపొందించాలని చెప్పారు. వాస్తవ కొనుగోళ్లు, పన్ను చెల్లింపులతో ఈ సమాచారాన్ని సరిపోల్చడం ద్వారా ఆదాయ లీకేజీలను గుర్తించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు.

### ప్రభుత్వ డేటా అంతా అనుసంధానం

మీసేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన సమాచారాన్ని కూడా అవసరమైన మేరకు సమీకృతం చేస్తే పరిపాలనలో మరింత ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వివిధ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, ఆదాయ వసూళ్లు, పరిపాలనా నిర్ణయాల్లో మరింత కచ్చితత్వం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు మరో మెగా బస్ టెర్మినల్

- గాజులరామారంలో 100 ఎకరాల్లో నిర్మాణం
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సులకు వేర్వేరు టెర్మినళ్లు
- ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రం
- నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రమంత్రి గడ్కరీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టే దిశగా మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. నగర శివారులోని గాజులరామారంలో ఏకంగా 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో వెల్లడించారు. ఈ టెర్మినల్ పూర్తయితే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరం మధ్యలోకి ప్రవేశించాల్సిన అవసరం తగ్గి ట్రాఫిక్‌పై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో ఏర్పాటు కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే హెచ్‌ఎంటీ అధికారులు కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇచ్చేందుకు అంగీకరించారని, ఐదేళ్లకోసారి దానిని సమీక్షిస్తామని షరతు విధించినట్లు పేర్కొన్నారు. దీనికితోడు ఏటా 6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలనే నిబంధన ఉండటంతో ఆ ప్రతిపాదనను ఆర్టీసీ తిరస్కరించినట్లు గడ్కరీ వివరించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీకి కేటాయించినట్లు తెలిపారు.

### ఒకేచోట రెండు టెర్మినళ్లు

గాజులరామారంలో ప్రతిపాదించిన బస్ టెర్మినల్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ నగర బస్సుల కోసం మరో టెర్మినల్ నిర్మించనున్నారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులను కూడా సమకూర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పర్యావరణహిత ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో విద్యుత్ బస్సుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించనున్నారు.

### నగరంలోకి రాకుండానే బస్సులు

కొత్త టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పలు బస్సులు హైదరాబాద్ నగరం నడిబొడ్డుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గాజులరామారం నుంచే రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడుతుంది. దీంతో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్‌తో పాటు ప్రధాన రహదారులపై వాహనాల ఒత్తిడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని గడ్కరీ తెలిపారు. కొత్త డిపో, టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ప్రజా రవాణా సదుపాయాలు మరింత విస్తరించనున్నాయి. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా నగర శివార్లలో ప్రజా రవాణా కేంద్రాలను అభివృద్ధి చేయడం ద్వారా నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉంది.

# మహిళపై సామూహిక లైంగికదాడి

## దృశ్యాలు చిత్రీకరించి బెదిరింపులు
## వీడియోలు బయటపెడతామంటూ బ్లాక్‌మెయిల్
## నలుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్

**జగిత్యాల, ఆగస్టు 7:** జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన జరిగింది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు ఆమె వ్యక్తిగత దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, వాటిని బయటపెడతామని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అక్కడికి చేరుకున్నారు. మహిళ తనకు సన్నిహితుడైన వ్యక్తితో ఉన్న సమయంలో వారి వ్యక్తిగత దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ వీడియోలను అడ్డుపెట్టుకుని మహిళను బెదిరించి నరేశ్, శ్రీకాంత్ ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నదని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించినట్లు తెలిపారు. ఘటన అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తమ వద్ద ఉన్న వీడియోలను ఇతరులకు పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బాధితురాలు గురువారం మల్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఉపయోగించిన ఇన్నోవా క్రిస్టా కారుతో పాటు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మొదటి నిందితుడు శివరాత్రి నరేశ్‌పై గతంలో 13 కేసులు, రెండో నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై తొమ్మిది కేసులు నమోదై ఉన్నాయని సీఐ తెలిపారు. వీరిద్దరిపై రౌడీషీట్లు కూడా ఉన్నట్లు వెల్లడించారు. మూడో నిందితుడు మారవేని మల్లేశ్‌పై రెండు, గుర్రం అంజయ్యపై ఒక పాత కేసు ఉన్నట్లు వివరించారు. మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సై సందీప్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంతంత్ర్య వేళ 'స్మార్ట్' రేషన్ కార్డులు

## 15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్
## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఈ కార్డుల పరిధిలోకి రానున్నారని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రజా పంపిణీ వ్యవస్థ కింద నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందించనున్నట్లు మంత్రి చెప్పారు. మొత్తం లబ్ధిదారుల అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేయనుందని వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అదే సమయంలో మిగిలిన 32 జిల్లాల్లోనూ కార్డుల పంపిణీ ప్రారంభం కావాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. పౌరసరఫరాల శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. కార్డుల కోసం వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పరిధిలో ఏకంగా 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉండటం ఈ కార్యక్రమం విస్తృతికి నిదర్శనమన్నారు. స్వతంత్ర భారతదేశంలో అమలవుతున్న అత్యంత ప్రభావవంతమైన ఆహార భద్రత కార్యక్రమాల్లో ఇది ఒకటని మంత్రి అభివర్ణించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో తాను భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆహార భద్రతతో పాటు



గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమం ప్రారంభమవుతున్నందున జిల్లా యంత్రాంగం దీనికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. కార్డుల పంపిణీలో ఆలస్యం లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆగస్టు 15 నుంచే అన్ని జిల్లాల్లో లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# 'నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా!'

- భార్య ఫోన్‌లో సందేశాలు చూసి భర్త షాక్
- ప్రియుడితో కలిసి హత్యకు కుట్ర పన్నిందని ఆరోపణ
- వెంటాడినట్లు ఫిర్యాదు.. తప్పించుకుని ఇంటికి చేరిన భర్త
- డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

**డోర్నకల్, ఆగస్టు 7:** 'ఎలాగైనా నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా' అంటూ భార్య తన ప్రియుడికి పంపినట్లు చెబుతున్న సందేశాలు భర్త కంటపడటం కలకలం రేపింది. తనను హత్య చేసేందుకు భార్య, ఆమె ప్రియుడు కుట్ర పన్నారని ఆరోపిస్తూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా భవానికి సైదులు అనే కొరియర్ ఉద్యోగితో వివాహేతర సంబంధం కొనసాగుతోందని రాజేశ్వరరావు ఆరోపించారు. ఈ విషయం గత నెల 27న తనకు తెలిసిందని, దీంతో కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించాడని ఆరోపించారు. అతడి నుంచి తప్పించుకుని తిరిగి ఇంటికి చేరుకున్నట్లు తెలిపారు. అనంతరం భార్య ఫోన్‌ను పరిశీలించగా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగినట్లు చెబుతున్న సంభాషణలు చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు రాజేశ్వరరావు పేర్కొన్నారు. తనను ఎలాగైనా చంపాలని, అలా చేయకపోతే తాను చనిపోతానంటూ భవాని సైదులుకు సందేశాలు పంపినట్లు గుర్తించానని ఆరోపించారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ రాజేశ్వరరావు డోర్నకల్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. భార్యాభర్తల మధ్య వివాదం, ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగినట్లు



చెబుతున్న సంభాషణలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఆరోపణల్లో వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

- జీఆర్ఎంబీ అజెండాలోని మూడు అంశాలను ఉపసంహరించాలి
- కేంద్ర మంత్రికి హరీశ్‌రావు లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణకు చట్టబద్ధంగా దక్కిన నీటి హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 85 ప్రకారం తెలంగాణకు లభించిన హక్కులకు భంగం కలగకుండా చూడాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన లేఖ రాశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు 18వ సమావేశ అజెండాలో చేర్చిన 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను వెంటనే ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు కీలక సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం, సాంకేతిక సలహా కమిటీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే సమగ్ర పరిశీలన అనంతరం అనుమతులు ఇచ్చాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. సాంకేతిక, జలవిజ్ఞాన, ఇంజినీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే ఆయా అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సమర్థ సంస్థలు ఇచ్చిన అనుమతులను జీఆర్ఎంబీ వంటి అనుబంధ సంస్థలు తిరిగి సమీక్షించడం లేదా వాటిపై సందేహాలు లేవనెత్తడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలతో కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం అధికారాలే బల హీనపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కేంద్ర సంస్థలు ఇచ్చే అనుమతుల విశ్వసనీయతపైనా అనిశ్చితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి వివాదానికి సంబంధించిన అంశం కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియ చట్టబద్ధత, విశ్వసనీయతకు సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండాలో కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి, ముక్తేశ్వరం, చనకా-కొరట, మోదికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ ఎత్తిపోతల పథకం వంటి తెలంగాణ ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను తిరిగి పరిశీలించే అంశాలు ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. నిర్దేశిత చట్టబద్ధ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే ఈ ప్రాజెక్టులకు కేంద్ర సంస్థలు అనుమతులు ఇచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నీటి వాటా విషయంలో జీఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ గతంలో తీసుకున్న నిర్ణయాలను గౌరవించాలని కోరారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం పరిశీలించి అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులను మళ్లీ సమీక్షకు తీసుకురావడం తెలంగాణ సాగునీటి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అంతర్ పరివాహక ప్రాంతాలకు నీటిని మళ్లించే ముందు సంబంధిత పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల అవసరాలను తీర్చాలనే అంశం నమోదైందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల సంఘం జలవిజ్ఞానపరంగా ఇప్పటికే అంగీకరించిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను తిరిగి సమీక్షించడం వల్ల సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు తాగునీటి భద్రతపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. తెలంగాణలోని లక్షలాది మంది రైతుల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. జీఆర్ఎంబీ 18వ సమావేశ అజెండాలోని 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను తక్షణమే ఉపసంహరించేలా ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం ఇప్పటికే మంజూరు చేసిన సాంకేతిక సలహా కమిటీ అనుమతులను జీఆర్ఎంబీ తిరిగి సమీక్షించకుండా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకంతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన సాగునీటి ప్రాజెక్టులకు మిగిలిన అనుమతులను వేగంగా మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలతో పాటు తెలంగాణ నీటి హక్కులు పరిరక్షించబడతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదే సమయంలో కేంద్ర సంస్థలు ఇచ్చే చట్టబద్ధ అనుమతులపై విశ్వసనీయత కూడా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# నేతన్నను నట్టేట ముంచారు

- చేనేత సంక్షోభంపై సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
- నిలిచిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- చేనేత భరోసా, రుణమాఫీ హామీలు ఏమయ్యాయని ప్రశ్న
- బీమా, చేయూతతో గతంలో నేతన్నలకు అండగా నిలిచామని వెల్లడి
- కేంద్ర నిర్ణయాలతోనూ చేనేత రంగానికి తీవ్ర నష్టమని విమర్శ



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో నేతన్నలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో వేలాది చేనేత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. నిలిచిపోయిన పథకాలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించేలా ప్రభుత్వం తన వాటాను జమ చేసిన 'నేతన్నకు చేయూత' దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ ఆర్డర్లు ఇచ్చి వేలాది నేతన్న కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. చేనేత భరోసా కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణమాఫీ, జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదన్నారు. చేనేత రంగం విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కేటీఆర్ విమర్శించారు. అఖిల భారత చేనేత బోర్డు, హస్తకళల బోర్డు, మరమగ్గాల బోర్డుల రద్దుతో పాటు పలు సంక్షేమ పథకాలను నిలిపివేయడం చేనేత రంగానికి నష్టం చేసిందన్నారు. చేనేత ఉత్పత్తులపై 5శాతం జీఎస్టీ విధించడం నేతన్నలపై మరింత భారాన్ని మోపిందని పేర్కొన్నారు. చేనేత రంగం విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని విమర్శించారు. నేతన్నల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. నేతన్నల జీవనోపాధిని కాపాడితేనే చేనేత రంగంతో పాటు తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం నిలుస్తాయని కేటీఆర్ తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- తెలంగాణలో ఒంటరిగానే అధికారంలోకి..
- జనసేన సహా ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు
- 937 మండలాల్లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ
- కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు




**ఢిల్లీ, ఆగస్టు 7:** తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేకుండా సొంతంగా అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. జనసేన సహా ఏ పార్టీతోనూ రాష్ట్రస్థాయిలో పొత్తు పెట్టుకునే ఆలోచన లేదని తేల్చిచెప్పారు. అయితే ఎన్డీయేలో జనసేన భాగస్వామిగా ఉన్నందున ఆ అంశంపై ఏదైనా నిర్ణయం ఉంటే జాతీయస్థాయిలోనే తీసుకుంటారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రాష్ట్రానికి చెందిన ఎంపీలు శుక్రవారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను సమీక్షించారు. సమావేశం అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 937 మండలాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ బీజేపీని బలోపేతం చేసి అధికారంలోకి వస్తామని రామచందర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో పార్టీలో కీలక చేరికలు ఉంటాయనే సంకేతాలిచ్చారు. బీజేపీ రాష్ట్ర నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. పార్టీ నాయకత్వమంతా ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించిన రామచందర్‌రావు.. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబిన్ తెలంగాణకు వచ్చి రాష్ట్ర నేతలతో సమావేశమవుతారని తెలిపారు. పార్టీ సంస్థాగత పరిస్థితిని సమీక్షించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ తదితర నేతలు పాల్గొన్నారు.






# అధికారులను కోర్టుకు పిలిపించడం బాధాకరం

- ప్రభుత్వాలు చేసిన తప్పులతోనే అధికారులకు ఈ పరిస్థితి
- ఉచిత పథకాలతో రాష్ట్ర ఖజానాపై తీవ్ర భారం
- సంపన్నులు, అధికారులు రైతుబంధు తీసుకోవడం బాధాకరం
- సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 7:** ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల కారణంగా ఉన్నతాధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ వ్యవహారంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హైకోర్టు ముందు హాజరైన సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై దాదాపు వెయ్యి కేసులు ఉన్నాయని పేర్కొన్న హైకోర్టు.. వాటన్నింటినీ విచారించి శిక్షలు విధించే పరిస్థితి వస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. అయితే ప్రభుత్వాలు చేసిన తప్పుల కారణంగానే అధికారులకు ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని అభిప్రాయపడింది. ఉన్నతాధికారులను పదేపదే హైకోర్టుకు పిలిపించడం తమకూ బాధగానే ఉందని న్యాయస్థానం పేర్కొంది. అయితే కోర్టు ఆదేశాలు అమలు కానప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లోనే అధికారులను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించాల్సి వస్తోందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉచిత పథకాలపైనా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచిత పథకాల వల్ల ఆర్థికంగా ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడింది. రైతుబంధు వంటి పథకాల ప్రయోజనాలను సంపన్నులతో పాటు అధికారులు కూడా పొందడం బాధాకరమని పేర్కొంది. అర్హతతో సంబంధం లేకుండా ప్రయోజనాలు అందించడం వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడుతుందని వ్యాఖ్యానించింది. ప్రజాధనాన్ని వినియోగించే విషయంలో ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విచారణ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది.

# ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పెట్టాల్సిందే

- ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ కీలక ఆదేశాలు
- తరగతుల వారీగా ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి
- పాఠశాల వెబ్‌సైట్, విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేసే అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి ప్రైవేట్ పాఠశాల తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.

## విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు

ఫీజుల వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో తెలిపే పత్రాలతో పాటు పాలకవర్గ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై తల్లిదండ్రులకు స్పష్టత లభించనుంది.

## ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జీఓ ఎంఎస్ నంబర్ 1 (1994)లోని నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై అదే జీఓలోని రూల్ 11 ప్రకారం అనుమతులు లేదా గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.



## సంపాదకీయం



# మనుషుల మధ్య గోడలు ఎందుకు?

### కులం, మతం పేరుతో ఇంకా ఎంతకాలం వివక్ష?

### శాస్త్రం ముందుకు దూసుకెళ్తుంటే మనసులు మాత్రం వెనక్కేనా?

### విద్వేషం కాదు.. మానవత్వమే భారతీయతకు అసలైన చిరునామా

### సమానత్వం, సౌభ్రాతృత్వమే రాజ్యాంగ స్ఫూర్తి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచనల్లో పేర్కొన్న అనేక సంఘటనలు భారత సమాజంలో ఒకప్పుడు ఎంత తీవ్రమైన కుల వివక్ష ఉండేదో మనకు గుర్తుచేస్తాయి. కింది కులానికి చెందిన వారు తమ పెళ్లి భోజనంలో పాయసం వండుకున్నారనే కారణంతోనే దాడులకు గురైన ఘటనలను ఆయన ప్రస్తావించారు. తమ కష్టార్జితంతో సంపాదించిన ఆహారం తినే హక్కు కూడా లేని పరిస్థితి ఒకప్పుడు ఈ సమాజంలో ఉండేదంటే అది ఎంతటి అమానవీయ వ్యవస్థో అర్థమవుతుంది. కాలం మారింది. దేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోకి ప్రవేశించింది. అంతరిక్షంలో అడుగులు వేస్తోంది. జన్యుశాస్త్రం మనుషుల మధ్య జీవశాస్త్రపరంగా పెద్దగా విభజనలు లేవని చెబుతోంది. అయినా కులం, మతం, వర్గం పేరుతో మనుషులను వేరుచేసే మనస్తత్వం మాత్రం పూర్తిగా మాయమైపోలేదు. ఇదే మన సమాజానికి అతిపెద్ద వైరుధ్యం. ఒకప్పుడు అగ్రవర్ణ ఆధిపత్యం రూపంలో కనిపించిన వివక్ష, ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ఆర్థికంగా, సామాజికంగా బలపడిన ఇతర వర్గాల మధ్య కూడా పునరావృతమవుతున్నదనే విమర్శలు ఉన్నాయి. అంటే సమస్య కేవలం ఒక కులానికి, ఒక మతానికి పరిమితం కాదు. అధికార భావం ఎక్కడ పెరిగితే అక్కడ దమనకాండ పుట్టుకొస్తుంది. అందుకే సమానత్వం అనే విలువను సమాజం మొత్తంగా ఆచరించాల్సిన అవసరం ఉంది. మతపరమైన గుర్తింపుతో అవమానాలు ఎదుర్కొంటున్న అనేక మంది జీవిత కథలు మన చుట్టూ ఉన్నాయి. చిన్నప్పటి నుంచే తన ముస్లిం గుర్తింపు కారణంగా హేళనలు, తిరస్కారాలు ఎదుర్కొన్న ఒక యువ జర్నలిస్టు అనుభవాలు ఈ విషయంలో మనకు అద్దం పడతాయి. బాల్యంలో తోటి పిల్లల మాటల నుంచి, హాస్టల్ వార్డెన్ వ్యాఖ్యల వరకు, కళాశాల ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన నుంచి పరిచయస్తుల దూరత్వం వరకు అతడు అనుభవించిన వివక్ష ఒక వ్యక్తిని ఎంతగా మానసికంగా గాయపరుస్తుందో చూపిస్తుంది. ఒక పిల్లవాడిని అతని మతం ఆధారంగా హేళన చేయడం, ఒక విద్యార్థిని అతని పేరుతోనే ఉగ్రవాదంతో అనుసంధానించడం, ఒక సహపాఠిని అతని జన్మపరమైన గుర్తింపుతో దూరం పెట్టడం ఇవన్నీ వ్యక్తిగత అవమానాలు మాత్రమే కావు. సమాజం తనలో దాచుకున్న వివక్షకు అవి ప్రతిబింబాలు. కర్నాటకలో ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో ముస్లిం విద్యార్థిని ఉగ్రవాదిగా సంబోధించినట్లు గతంలో వెలువడిన ఘటనలు కూడా మన విద్యా వ్యవస్థలో విలువల బోధన ఎంత అవసరమో గుర్తుచేశాయి. పిల్లలకు జ్ఞానం అందించాల్సిన ఉపాధ్యాయుడే పక్షపాత భావనలను ప్రదర్శిస్తే విద్యకు అర్థమేంటి అనే ప్రశ్న తలెత్తుతుంది. చట్టం ముందు అందరూ సమానులని రాజ్యాంగం స్పష్టం చేసింది. కులం, మతం, జాతి, లింగం పేరుతో వివక్ష చూపరాదని ప్రకటించింది. అయితే చట్టాల్లో ఉన్న సమానత్వం సామాజిక జీవితంలోనూ కనిపించాలి. పుస్తకాల్లో సమానత్వం చదివి, ప్రవర్తనలో మాత్రం వివక్ష చూపితే రాజ్యాంగ విలువలు కేవలం అక్షరాలుగానే మిగిలిపోతాయి. అదే సమయంలో భారత సమాజంలో మానవత్వానికి అద్భుత ఉదాహరణలూ ఉన్నాయి. కర్నాటకలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు హిందూ పిల్లలను మహబూబ్, నూర్జహాన్ అనే ముస్లిం దంపతులు తమ పిల్లల్లా పెంచి, వారి మతం మార్చకుండా, వారి సంప్రదాయం ప్రకారమే వివాహం జరిపించిన సంఘటన మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. మతం కన్నా మనిషి గొప్పవాడని చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు చాలు. మన జాతీయ చరిత్రలోనూ వివిధ మతాల ప్రజలు భారత నిర్మాణంలో విశేష పాత్ర పోషించారు. 'జైహింద్' అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన ఆబిద్ హసన్ సఫ్రానీ నుంచి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వేలాది మంది ముస్లింల వరకు భారత జాతీయోద్యమం సహజంగానే బహుళత్వాన్ని ప్రతిబింబించింది. దేశభక్తికి మతం కొలమానం కాదని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. భారతదేశం ఏ ఒక్క కులానిదో, ఏ ఒక్క మతానిదో కాదు. ఇది అందరిదీ. జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగం అన్నీ మన సమిష్టి గుర్తింపులు. 'మేరా భారత్ మహాన్' అని చెప్పడం అంటే మనతో సమానంగా జీవిస్తున్న ప్రతి భారతీయుడిని గౌరవించడం కూడా. విద్వేష ప్రసంగాలు తాత్కాలికంగా రాజకీయ ప్రయోజనాలు ఇవ్వవచ్చు. కానీ అవి సమాజంలో దీర్ఘకాలిక గాయాలు మిగులుస్తాయి. ఒకసారి ప్రజల మధ్య అనుమానం, భయం, శత్రుత్వం పెరిగితే దాన్ని తొలగించడం చాలా కష్టం. అందుకే పాలకులు, రాజకీయ పార్టీలు, మత నాయకులు, మీడియా, విద్యావంతులు అందరూ తమ మాటల విషయంలో బాధ్యత వహించాలి. శాస్త్రం మనుషులందరూ ఒకే మానవజాతికి చెందినవారని చెబుతోంది. రాజ్యాంగం అందరూ సమానులని చెబుతోంది. మానవత్వం ఒకరిని ఒకరు ఆదుకోవాలని చెబుతోంది. మరి మనం ఇంకా కులం, మతం పేరుతో ఒకరిని ఒకరు ద్వేషించుకోవడం ఎందుకు? నాగరికత అంటే కేవలం పెద్ద నగరాలు, సాంకేతిక విజ్ఞానం, అంతరిక్ష ప్రయోగాలు కాదు. మనతో విభిన్నంగా ఉన్న వ్యక్తిని కూడా సమాన గౌరవంతో చూడగలగడమే నిజమైన నాగరికత. మతం మారినా మనిషి మారడు. కులం మారినా రక్తం రంగు మారదు. భాష మారినా కన్నీటి రుచి మారదు. అందుకే నేటి భారతదేశానికి అత్యవసరంగా కావాల్సింది కొత్త విద్వేషాలు కాదు.. కొత్త మానవత్వం. మనువాదపు నిచ్చెనమెట్లు కాదు.. రాజ్యాంగ సమానత్వం. పరస్పర అనుమానం కాదు.. సౌభ్రాతృత్వం. మనిషిని మనిషిగా చూడగల దృష్టి పెరిగినప్పుడే భారతదేశం నిజమైన అర్థంలో మహోన్నత దేశంగా నిలుస్తుంది.

# ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

- ఎన్డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ భరోసా
- కూటమిలో ప్రతి ఎంపీకి సమాన గౌరవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- అవసరమైతే నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించండి
- పార్లమెంట్‌లో అంతరాయాలతో కొత్త ఎంపీలకు అవకాశం దక్కడం లేదని ఆవేదన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** "ఎన్డీఏ ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీ ఎంపీకి సమాన గౌరవం ఉంటుంది. నేను ఒక పార్టీకి మాత్రమే కాదు.. ప్రతి ఎంపీకి అండగా ఉంటాను. ఎలాంటి ఆందోళన అవసరం లేదు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన అల్పాహార సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయమని మోదీ పేర్కొన్నారు. ఇటీవల సభలో జరుగుతున్న ఆందోళనలు, అంతరాయాల కారణంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగాలని, ప్రతి సభ్యుడూ తన అభిప్రాయాలను వెల్లడించే వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. పార్లమెంట్ చరిత్రను ఎంపీలు అధ్యయనం చేయాలని మోదీ సూచించారు. గతంలో జరిగిన కీలక చర్చలు, సభ్యుల ప్రసంగాలు, పార్లమెంటరీ సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా సభలో తమ ప్రసంగాలను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. దేశాభివృద్ధి రాష్ట్రాల ప్రగతితోనే సాధ్యమవుతుందని పేర్కొన్న ప్రధాని.. ప్రతి ఎంపీ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమస్యలు ఎదురైతే అవసరమైతే నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెప్పారు. పేదలు, రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని ఎంపీలకు సూచించారు. ఈ సమావేశానికి శివసేన నుంచి ఏడుగురు, ఎన్సీపీఐ నుంచి 20 మంది, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం నుంచి ఇద్దరు సహా సుమారు 45 మంది ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్‌ను వీడి ఎన్డీఏలో చేరిన ఎంపీలు, ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలకు మోదీ ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. "ఎన్డీఏలో చిన్న పార్టీ, పెద్ద పార్టీ అనే తేడా లేదు. ప్రతి ఎంపీకి సమానమైన గౌరవం ఉంటుంది. మీకు అండగా నేనున్నాను" అని మోదీ స్పష్టం చేసినట్లు సమాచారం. సమావేశం అనంతరం ఒక్కో ఎంపీతో విడివిడిగా మాట్లాడిన ప్రధాని వారి నియోజకవర్గాల్లోని పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. అంతకుముందు రోజు తన నివాసంలో బీజేపీకి చెందిన 37 మంది ఎంపీలతోనూ మోదీ విందు సమావేశం నిర్వహించారు. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలు, ప్రజాసేవపై వారితో అభిప్రాయాలను పంచుకున్నారు. ఢిల్లీలో జరిగే రాజకీయ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రతిపక్ష ఎంపీలతో సత్సంబంధాలు కొనసాగించాలని కూడా మోదీ సూచించినట్లు సమాచారం.



# చిత్తశుద్ధి ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

### మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్

### జెన్‌జీపై ప్రేమ మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి

### విద్యార్థులపై అణచివేతను ఎందుకు ఖండించలేదు?

### ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని ఆరోపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** జెన్‌జీ యువతపై నిజంగా శ్రద్ధ, చిత్తశుద్ధి ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో రాజీనామా చేయించాలని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సవాల్ విసిరారు. యువత ఆందోళనలు సమర్థనీయమైనవేనంటూ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని వేణుగోపాల్ ఆరోపించారు. అలాంటప్పుడు నిరసనలు చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు ఆ సంస్థ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జెన్‌జీ యువతపై భాగవత్‌కు నిజంగానే శ్రద్ధ ఉంటే అమిత్ షా రాజీనామాను కోరాలని డిమాండ్ చేశారు. "విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే పెల్లెట్ గన్స్ ప్రయోగం, లాఠీచార్జి రూపంలో జరిగిన అణచివేతను భాగవత్ బహిరంగంగా ఖండించాలి. కానీ ఇప్పటివరకు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని వేణుగోపాల్ ప్రశ్నించారు. యువతను అర్థం చేసుకోవాలని ఒకవైపు చెబుతూ, మరోవైపు వారి నిరసనలపై ప్రభుత్వ చర్యలను ప్రశ్నించకపోవడంలో అర్థం లేదన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడాలనుకుంటే మాటలతో సరిపెట్టకుండా చర్యల ద్వారా నిరూపించుకోవాలని సూచించారు. లేదంటే జెన్‌జీపై చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కంటితుడుపు చర్యలుగానే మిగిలిపోతాయని వేణుగోపాల్ విమర్శించారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

### కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# ఆ మూడు రోజులు సభలో ఉండాల్సిందే

### కాంగ్రెస్ ఎంపీలకు అధిష్ఠానం విప్



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పార్లమెంట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అప్రమత్తమైంది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో లోక్‌సభ, రాజ్యసభలకు తమ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని విప్ జారీ చేసింది. వివాదాస్పద విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ పార్టీ సభ్యులకు విప్ జారీ చేశారు. మూడు రోజులపాటు సభలో అత్యంత కీలకమైన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరై పార్టీ వైఖరికి మద్దతుగా నిలవాలని సూచించారు. దీనిని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని స్పష్టం చేశారు. లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే తరహాలో విప్ జారీ చేశారు. మూడు రోజులపాటు ఎంపీలంతా సభలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇండియా కూటమిలోని మిత్రపక్షాలకు కూడా సమాచారం అందించి, ఆయా పార్టీల ఎంపీలు పార్లమెంట్‌కు పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడాలని కోరినట్లు సమాచారం. విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ముందుగానే తమ ఎంపీలను అప్రమత్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే వచ్చే వారానికి సంబంధించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాలో ఈ రెండు బిల్లుల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీంతో మూడు రోజులపాటు పార్లమెంట్‌లో ఏ కీలక అంశాలు ముందుకొస్తాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఎఫ్‌సీఆర్‌ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం

### స్పందించిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్‌ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ చట్టంతో క్రిస్టియన్ సంస్థలపైనే అధిక ప్రభావం పడేలా ఉందని అన్నారు. క్రిస్టియన్‌లను టార్గెట్ చేసుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందని కూడా వ్యాఖ్యానించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్‌ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

# చేనేతకు చేయూత.. నేతన్నకు భరోసా!

- **చేనేతను కాపాడుకుందాం.. నేతన్నను ఆదుకుందాం**
- **చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం...**
- **చేనేత రంగ అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేయండి సీఎం దృష్టికి తీసుకెళ్తా**
- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**హనుమకొండ, ఆగస్టు 7 ::**
చేనేత కార్మికుల సంక్షేమం, వారి జీవనోపాధి మెరుగుదలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి ఘనమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం చేనేత కళకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు.చేనేత ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, వినూత్న డిజైన్లను ప్రోత్సహించడం, కార్మికులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లాలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి అవసరమైన అభివృద్ధి చర్యలతో డీపీఆర్ సిద్ధం చేసి అందించాలని, దానిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి చేనేత రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించేలా కృషి చేస్తానని తెలిపారు.చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చేనేతను కాపాడుకుంటూ నేతన్నలకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే సూచించిన విధంగా చేనేత సంఘాల ప్రతినిధులు చేనేత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేసి అందించాలని సూచించారు.అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానిం చారు. చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినం దించారు. వారిని చేనేత వస్త్రాలతో సన్మానించారు.కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించి చేనేత చీరను కొనుగోలు చేశారు. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రజలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి , చేనేత సంఘాల ప్రతినిధులు, చేనేత కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- **మహిళల భద్రత కు అండగా "షీ" టీమ్**
- **పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు**
- **జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్,డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం**

**పరిగి (మం)ఆగస్టు,07:**
మహిళల భద్రత కోసమే "షీ" టీమ్ నిరంతరం పనిచేస్తుందని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు తెలిపారు.పరిగి పోలీస్ స్టేషన్ పరిధి లోని గడసింగపూర్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు విద్యార్థిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ మాట్లాడుతూ... మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పరిచిన టోల్ ఫ్రీ 8నెంబర్లు 112, 181 ను సంప్రదించాలని అన్నారు. అదేవిదంగా మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టి-సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలన్నారు.ముఖ్యంగా యాంటీ






ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ జడ్.పి.హెచ్.ఎస్ ఇంచార్జ్ హెడ్మాస్టర్ ఆదిశంకర్,మరియు ఉపాధ్యాయులతో,విద్యార్థినిలు, పాటు "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి శోభ,తదితరులు పాల్గొన్నారు.

# బోడగుట్టకు మహర్దశ.. అభివృద్ధికి కొత్త 'బాట'.!

- **ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం... ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **అంతర్గత రోడ్ల నిర్మాణానికి శ్రీకారం.. పట్టణ స్థాయి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**



**హనుమకొండ, ఆగస్టు 7 ::**
వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.ప్రస్తుతం గ్రామీణ వాతావరణాన్ని కలిగి ఉన్న బోడగుట్టకు పట్టణ స్థాయి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధికి కొత్త ఒరవడి ప్రారంభమైందని పేర్కొన్నారు.నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బోడగుట్టలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి బోడగుట్టను ఆదర్శ ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.అనంతరం స్థానిక ప్రజలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై వెంటనే స్పందించిన ఆయన.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన అంచనాలను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన పనుల ద్వారానే మౌలిక వసతులు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని అధికారులకు స్పష్టం చేశారు.ప్రజల అభివృద్ధి కోసం కేటాయించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని, నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సహకారంతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్యం అందించిన ఘనత ఆరోగ్యశ్రీదే

- **ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు**

**ఆలేరు, ఆగస్టు 7::**
పేదలు, బడుగు బలహీన వర్గాలకు కార్పొరేట్ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు శుక్రవారం ఆలేరులో ఘనంగా నిర్వహించారు. ఆలేరు పట్టణంలోని ఎస్బిఐ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడిన మహానేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథకానికి ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు.పేద కుటుంబానికి చెందిన ఓ బాలిక గుండె జబ్బుతో బాధపడుతూ చికిత్సకు లక్షల రూపాయలు అవసరమైన పరిస్థితిలో మందకృష్ణ మాదిగను ఆశ్రయించిందని తెలిపారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పేదలకు ఉచిత వైద్యం అందించాలని ఆయన పోరాటం చేశారని పేర్కొన్నారు. 2004లో గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులతో హైదరాబాద్‌లో నిర్వహించిన ఉద్యమం ఫలితంగా ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుందని తెలిపారు. ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు.ఎంఆర్‌పీఎస్ ఉద్యమం కేవలం మాదిగల రిజర్వేషన్లకే పరిమితం కాకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కూడా అనేక పోరాటాలు చేసిందని నాయకులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెల్లరేషన్ కార్డుదారులకు రేషన్ కోటా పెంపు, మహిళలపై అఘాయిత్యాల నిరోధానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అంశాల్లో ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్-ఎంఎస్‌పీ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్ల చంద్రస్వామి మాదిగ, మండల ఇన్‌చార్జి కందుల నర్సింగ్‌రావు మాదిగ, పట్టణ ఇన్‌చార్జి పుల్లూరి రవి మాదిగ, సీనియర్ నాయకులు పాకాల హరీష్ మాదిగ, సుంచు ప్రేమ్ మాదిగ, బీబీనగర్ లక్ష్మణ్ మాదిగ, గ్యార భిక్షపతి మాదిగ, కంతి ఉమేష్ మాదిగ, గ్యాదపాక రాజు మాదిగ, కంతి బన్నీ మాదిగ, కంతి భాను మాదిగ, పుట్టల సాగర్ మాదిగ, గ్యార సిద్ధులు మాదిగ, కందుల కుమార్ మాదిగ, పంగ దశరథ మాదిగ, సైదాపురం రవి మాదిగ, కేశవులు మాదిగ, కళ్లెం రవి మాదిగ, సూర్యనారాయణ మాదిగ, ఎల్లయ్య మాదిగ, రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.




## పేదల గుండెల్లో ఆశలు నింపుతున్న 'రాఘవ' సేవలు

### 70 మంది పేద రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు



**ఆలేరు, ఆగస్టు 7::**
ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి దూరమవుతున్న పేదలకు అండగా నిలుస్తూ రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. సంస్థ ఆధ్వర్యంలో ఆగస్టు 5న నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యుల పరీక్షలు, సలహాల అనంతరం శస్త్రచికిత్సలు అవసరమైన 70 మంది పేద రోగులను మేడ్చల్‌లోని మెడిసిటీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల పర్యవేక్షణలో రోగులకు అవసరమైన వివిధ రకాల శస్త్రచికిత్సలను ఉచితంగా నిర్వహించేందుకు మెడిసిటీ ఆస్పత్రి యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు నాణ్యమైన వైద్యం అందించడం గొప్ప సేవ అని తెలిపారు.పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత వైద్య సేవలకు సహకరిస్తున్న మెడిసిటీ ఆస్పత్రి యాజమాన్యానికి రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు అండగా నిలుస్తామని సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేష్ తెలిపారు.

## సీఇఓ వాసం వెంకటేశ్వర్లు ఐఏఎస్ ను స్వాగతం పలికిన-

### అదనపు కలెక్టర్ వెంకటాచారి, డిఆర్ఓ స్వర్ణలత



**వికారాబాద్, ఆగస్టు,07:**
**వికారాబాద్:** తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సి ఇ ఓ వాసం వెంకటేశ్వర్లు, ఐ ఎ ఎస్, వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నందున మొక్క అందజేసి స్వాగతం పలికిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ ఓ స్వర్ణలత,

## యువతను కాపాడుకుందాం.. వ్యసనాలను తరిమికొడదాం!

- **నశా రహిత సమాజం కోసం నడుం బిగిద్దాం...ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో '10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం' పోస్టర్ ఆవిష్కరణ**



**హనుమకొండ/బాలసముద్రం, ఆగస్టు 7 ::** వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు.బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న '10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం' పోస్టర్‌ను శుక్రవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు.అనంతరం 'నశా ముక్త్ భారత్ అభియాన్' (వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర)లో భాగంగా వ్యసనాల నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు తదితర వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యసనాల కారణంగా వ్యక్తుల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.వ్యసన రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ముఖ్యంగా యువతను వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని తెలిపారు.వ్యసన విముక్తి కోసం నిర్వహిస్తున్న మహా ఉద్యమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ బీకే విమల, శోభ, కల్పన, అనిల్, రాఘవచారి, శ్యామ్, అరుణ్తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకు జిల్లా యంత్రాంగం అండ

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, ఆగస్టు 7 :):** చేనేత రంగ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకారం అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గద్వాల్, నారాయణపేట చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పిస్తూ శిల్పారామంలో విక్రయ స్టాళ్లు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉచిత ప్రదర్శన స్టాళ్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాకు వచ్చే అతిథులకు స్థానిక చేనేత ఉత్పత్తులనే బహుమతులుగా అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అనంతరం చేనేత కార్మికులను సన్మానించి, చేనేత వస్త్రాల ప్రదర్శనను సందర్శించి కొన్ని చీరలను కొనుగోలు చేశారు.

చురకలు



## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి 'ప్రొఫెసర్ కోదండరాం' పరామర్శ

- ఉద్యమ సహచరుడి మృతి బాధాకరం.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా




**నర్సంపేట/నల్లబెల్లి, ఆగస్టు 7 ::** ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే(నర్సంపేట) పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పరామర్శించి నివాళులర్పించారు.శుక్రవారం నల్లబెల్లి మండలంలోని పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి చేరుకున్న ప్రొఫెసర్ కోదండరాం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని, తెలంగాణ ఉద్యమంలో సుదర్శన్ రెడ్డి పోషించిన పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సుదర్శన్ రెడ్డి చేసిన పోరాటం, ప్రజా సమస్యలపై ఆయన చూపిన చొరవ, ప్రజల కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కోదండరాం పేర్కొన్నారు. ఉద్యమ భావజాలానికి కట్టుబడి పనిచేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆయన ఆశయాలు, ప్రజా సేవా స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కష్ట సమయంలో వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. మహిళా నాయకురాళ్లు గుడిపూడి అరుణ, రామచందర్, కాసాని పద్మ, రామగిరి మాధవి, మాటేటి రజిత, యాస్మిన్, సరిత, అకారపు సరోజనతో పాటు నెక్కొండ, నల్లబెల్లి మండలాలకు చెందిన మహిళా నాయకురాళ్లు, ఉద్యమకారులు పాల్గొని దివంగత సుదర్శన్ రెడ్డికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్, రాష్ట్ర నాయకులు గుంటి రామచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు డోలి సత్యనారాయణ, పిల్లి సుధాకర్, మహబూబ్ అలీ, సాయికుమార్, శివకుమార్, సంధాని, బొట్ల పవన్, ఐలయ్య తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పురానిపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ

**జగిత్యాల, ఆగస్టు 7 :):** జగిత్యాల పట్టణంలోని పురానిపేట ప్రభుత్వ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడిన ఆమె క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆత్మవిశ్వాసంతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, ఆగస్టు 7** జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీగా తనిఖీ చేశారు. గోదాం సీళ్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, ఈవీఎంల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి ఆదేశించారు. ఎన్నికల పారదర్శకత కోసం ప్రతి నెల ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణకు సాంకేతికత వినియోగం అవసరం

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**గద్వాల్, ఆగస్టు 7 ::** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణలో ఆధునిక




సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గద్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎకో సెన్స్' ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు.వర్క్‌షాప్‌లో పీఎం శ్రీ పాఠశాలలు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు పక్షుల రియల్‌టైమ్ పర్యవేక్షణ, ధ్వనుల ఆధారంగా గుర్తింపు, సంచార వివరాల నమోదు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. రాస్ప్‌బెర్రీ పై సాంకేతికతతో పక్షుల ధ్వనులను గుర్తించి సమాచారాన్ని విశ్లేషించే విధానాన్ని ప్రాక్టికల్‌గా వివరించారు.విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రాజెక్టులు రూపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల్లో ఇలాంటి 'ఎకో సెన్స్' నమూనాలను ఏర్పాటు చేసి పర్యావరణహిత సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మల్లికార్జున్, మండల విద్యాధికారి ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి ఎం. సిద్ధిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి: అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టొద్దు

- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యపై మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత విమర్శలు

**ఆలేరు, ఆగస్టు 7::**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి అన్నారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టడం మానుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

### 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్ హామీ ఏమైంది?

ఎన్నికల సమయంలో ఆలేరును 100 రోజుల్లో రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని సునీత ప్రశ్నించారు. ఆ గడువు ఇప్పటికే దాటిపోయిందని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలేరు నియోజకవర్గంలో రోడ్లు, సాగునీరు, తాగునీరు, వైద్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని సునీత తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదని ప్రస్తుత ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఎమ్మెల్యే సిద్ధమా అని సవాల్ విసిరారు.

### మెడికల్ కాలేజీపై స్పష్టత ఇవ్వాలి

యాదాద్రి మెడికల్ కాలేజీకి సంబంధించి 300 పడకల ఆస్పత్రి, 433 పోస్టులు మంజూరయ్యాయని సునీత పేర్కొన్నారు. మెడికల్ కాలేజీని కొడంగల్‌కు తరలించడం, 320 పడకల ఆస్పత్రిని 220 పడకలకు పరిమితం చేయడం, ప్రతి విద్యా సంవత్సరంలో 100 ఎంబీబీఎస్ సీట్లకు బదులు 50 సీట్లు మాత్రమే ఉండటంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 100 పడకల ఆస్పత్రిని ఎందుకు రద్దు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

### బీఆర్ఎస్ హయాంలోనే వైద్య సదుపాయాల అభివృద్ధి

మున్సిపాలిటీలో రూ.15 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయని, 30 పడకల ఆస్పత్రిని 40 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి ఐసీయూ వార్డు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని సునీత అన్నారు. యాదాద్రి జిల్లాలో పేద రోగుల కోసం రూ.75 లక్షల సొంత నిధులతో ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించామని తెలిపారు.

### రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు




మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడం, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, హరితహారం ద్వారా పచ్చదనం పెంచడం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఆలేరు–మోత్కూరు, జీడికల్ వరకు సుమారు 40 కిలోమీటర్ల రహదారి, జీడికల్ అండర్‌పాస్, హాజీపూర్, మదనపల్లి బ్రిడ్జి, కల్వపల్లి, పారుపల్లి హై లెవల్ బ్రిడ్జి, రాయగిరి, ఆత్మకూరు డబుల్ రోడ్డు వంటి పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. పలు చెరువులు, చెక్‌డ్యామ్‌లు నిర్మించి రైతులకు సాగునీరు అందించామని, కొండపోచమ్మ సాగర్ నుంచి పలు గ్రామాలకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

### ఇళ్ల ఎంపికలో పారదర్శకత

రేషన్ కార్డులు, ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించామని సునీత తెలిపారు. ఆలేరులో 64 ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను తహసీల్దార్ ఆధ్వర్యంలో అఖిలపక్షాల సమక్షంలో నిర్వహించామని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించే ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనుసరించిన రాజకీయాలపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు, అధికారులు అందరి కృషి ఉందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకుని ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సూచించారు. ముఖ్యంగా ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వం, ఎమ్మెల్యేను డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, మున్సిపల్ కౌన్సిలర్లు బీజని కళ్యాణి మధు, పాకాల మోనిక హరీష్, టంగుటూరు సర్పంచ్ జుకంటి అనిల్, కొలనుపాక సర్పంచ్ బేధరబోయిన యకమ్మ, నాయకులు జల్లి నర్సింహులు, బింగి రవి, పంతం కృష్ణ, కుండే సంపత్, వెంకటేష్, పరిదే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

- చేనేత రంగాన్ని ఆధునికీకరించి కళాకారులను ఆదుకోవాలి

**ఆలేరు, ఆగస్టు 7::**

ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. పట్టణంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పద్మశ్రీ చింతకింది మల్లేశం, సంఘం అధ్యక్షుడు పాశికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చిక్క శ్రవణ్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి జీవనోపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత రంగం ముఖ్యమైనదన్నారు. స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7న కలకత్తాలో



ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజుకు చారిత్రక ప్రాధాన్యం ఉందని తెలిపారు. 2015 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.చేనేత కళాకారుల జీవనోపాధిని కాపాడటంతో పాటు ఆధునిక సాంకేతికత, నూతన డిజైన్లు, మార్కెటింగ్ విధానాలను అందిపుచ్చుకుని చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించి కళాకారులకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు.కార్యక్రమంలో డాక్టర్ చింతకింది మురళి, బేతి రాములు, బడుగు జహంగీర్, బింగి నర్సింహులు, బేతి శ్రీనివాస్, గట్టు రాజు, మెరుగు శ్రీధర్, అమృతం నర్సింలు, బేతి వెంకటేష్, గుజ్జ అశోక్, రాచర్ల నర్సింలు, గుజ్జ నాగేష్, బేతి బాలరాజ్, గోరంట్ల రాజు, బేతి లక్ష్మీనారాయణ, భోగ రమేష్, దూడం లక్ష్మీనారాయణ, బండ లక్ష్మణ్, నారాయణ, బూరల ఆంజనేయులు, బొంతపల్లి మనోహర్, చింతకింది వేణు, చిట్టి మిల్ల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## మార్పు కావాలి పాదయాత్రలు చేపట్టాలి

- పాదయాత్రల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వెంకటేష్

**ఆలేరు, ఆగస్టు 7::**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'బద్లావ్ జరూరీ హై.. మార్పు కావాలి' నినాదంతో పాదయాత్రలు నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరు మండల సీపీఐ కార్యాలయంలో మాటూరు జానమ్మ అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో పాదయాత్రల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో పాదయాత్రలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్రల ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ నెల 10న ఆలేరు పట్టణంలో పాదయాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించాలని మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో టౌన్ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాసరాజు, సహాయ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యుడు కందుల మధు, ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ప్రవీణ్, వ్యవసాయ




కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చౌడబోయిన పరశురాములు, ఏఐటీయూసీ నాయకుడు స్వామి, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ బర్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట...

- మెట్టుగుట్ట ఆలయ అభివృద్ధికి రూ.6.98 కోట్లతో పనులు... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- పదేళ్లుగా సేవలందిస్తున్న అర్చకుడికి శాశ్వత ఉద్యోగ నియామక పత్రం అందజేత

**వర్ధన్నపేట/మడికొండ, ఆగస్టు 7 ::** ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగానే కాకుండా అన్ని విధాలుగా సహకరిస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మెట్టుగుట్ట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.శుక్రవారం మెట్టుగుట్ట ఆలయ చైర్మన్ రఘుచందర్, ఆలయ ఈఓ, అర్చకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్రస్వామి పవిత్రోత్సవాలకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రత్యేక చొరవతో ఆలయంలో గత పదేళ్లుగా అర్చక సేవలు అందిస్తున్న పరశురాం విష్ణువర్ధన్ చార్యులుకు శాశ్వత ఉద్యోగ నియామక పత్రాన్ని



అందజేశారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్చకుడికి శాశ్వత ఉద్యోగం లభించడం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### రూ.6.98 కోట్లతో అభివృద్ధి పనులు...

మెట్టుగుట్ట ఆలయ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను పలుమార్లు కలిసి సమస్యలను వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన ప్రత్యేక చొరవతో ప్రస్తుతం ఆలయ అభివృద్ధికి రూ.6.98 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చెప్పారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దీప, ధూప, నైవేద్య పథకం ద్వారా ఆలయాలకు ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మెట్టుగుట్ట ఆలయం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయని ఎమ్మెల్యే అన్నారు.అలాగే విష్ణువర్ధన్ చార్యులు శాశ్వత ఉద్యోగం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖను పలుమార్లు కలిసిన నేపథ్యంలో తన ప్రత్యేక చొరవతో ఉద్యోగ నియామకం సాధ్యమైందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మెట్టుగుట్ట దేవస్థానం అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, అర్చకులు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట చేనేతకు దేశ, విదేశాల్లో విశేష ఆదరణ

- చేనేత సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలి.
- యువత ఆధునిక మార్కెటింగ్, ఈ-కామర్స్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
- జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ పిలుపు.



**నారాయణపేట, ఆగస్టు,07:**
నారాయణపేట జిల్లా అంటే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జీఐ ట్యాగ్ కలిగిన నారాయణపేట చేనేత చీరలేనని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. చేనేత వృత్తి జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని, ఈ గొప్ప సంప్రదాయాన్ని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తాను బాధ్యతలు స్వీకరించిన అనంతరం నారాయణపేట, కోటకొండ, జాజాపూర్ తదితర ప్రాంతాల్లోని చేనేత కుటుంబాలను సందర్శించి వారి పనితీరును స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. చేనేత కార్మికుల ప్రతిభ, నైపుణ్యం అభినందనీయమని, వారు తయారు చేసిన చీరలను తాను కూడా కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం చేనేత రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, నారాయణపేట చేనేత ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో విశేష ఆదరణ ఉందన్నారు. ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి ఆన్‌లైన్ ద్వారా నారాయణపేట చీరలకు ఆర్డర్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాలను మరింత విస్తరించేందుకు మార్కెటింగ్, ఈ-కామర్స్ వేదికలను సమర్థవంతంగా వినియోగిం చుకోవాలని సూచించారు.చేనేత కుటుంబాల యువతను గుర్తించి వెబ్‌సైట్ నిర్వహణ, ఫోటోగ్రఫీ, సోషల్ మీడియా మార్కెటింగ్, డిజిటల్ విక్రయాలపై ప్రత్యేక శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్, మధురై తదితర ప్రాంతాలకు శిక్షణ కోసం పంపించే ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు.

### మహిళా సంఘాల భాగస్వామ్యంతో మార్కెటింగ్‌కు ప్రాధాన్యం

మహిళా సంఘాల ద్వారా ఉత్తమ చేనేత ఉత్పత్తులను ఎంపిక చేసి ఆన్‌లైన్ విక్రయాలకు ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో చేనేత కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఆధునిక చేనేత కేంద్రం త్వరలో ప్రారంభం

నారాయణపేటలో ఏర్పాటు చేసిన ఆధునిక చేనేత కేంద్రంలో మగ్గాలు, కుట్టు యంత్రాలు, డైయింగ్ యూనిట్లు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించి టెస్కో ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత మార్కెట్ కల్పిస్తామని తెలిపారు.జీఐ ట్యాగ్‌తో నారాయణపేట చేనేతకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించిందని పేర్కొంటూ, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందిం చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దేశ, విదేశాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా డిజిటల్ మార్కెటింగ్, ఈ-కామర్స్ ద్వారా విక్రయాలను విస్త రించాలని సూచించారు. చేనేత కుటుం బాల యువతకు ప్రత్యేక శిక్షణతో పాటు మహిళా సంఘాల భాగస్వామ్యంతో మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేశారు. అలాగే పలువురు సీనియర్ చేనేత కార్మికులను శాలువాలతో సన్మానించి వారి సేవలను అభినం దించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వెంకట్ రాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ద్వారక్, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, చేనేత కార్మికులు, యువత పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం...

- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే సంకల్పం... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- 65, 66వ డివిజన్ల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**హనుమకొండ, ఆగస్టు 7 ::**
మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండపంలో 65, 66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మహిళా సాధికారతతో పాటు స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.అర్హులైన పేద మహిళలు, మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హత కలిగిన ప్రతి మహిళకు చీర అందేలా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.కుటుంబ అభ్యున్నతిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం పిల్లలను ఉన్నతంగా చదివించాలని మహిళలకు సూచించారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో మహిళలు మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు.మహిళలకు ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం కల్పించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాలను మహిళల పేరుతో మంజూరు చేయడం ద్వారా మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు.మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా స్వావలంబన సాధించే శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను



కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, 65వ డివిజన్ అధ్యక్షుడు సునీల్, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, మహిళా అధ్యక్షురాలు జోరిక పూల, మహిళా ఉపాధ్యక్షురాలు స్వాతి, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, మండల, డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

- విద్యార్థి మృతి అత్యంత దురదృష్టకరం
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.





**నారాయణపేట, మండలం, ఆగస్టు,07:**
నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్న త పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక సందర్శించారు. ఈ నెల 6వ తేదీన ఆ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థి రంజిత్ పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన దురదృష్టకర ఘటన నేపథ్యంలో కలెక్టర్ పాఠశాలను సందర్శించి, విద్యార్థి పాముకాటుకు గురైన తరగతి గది, కిటికీలు, పాఠశాల పరిసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థి మృతి పట్ల కలెక్టర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.మన జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. అయినప్పటికీ ఎక్లాస్‌పూర్ పాఠశాలలో జరిగిన ఈ ఘటన అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.పాఠశాలను సమగ్రంగా పరిశీలించి, అవసరమైన మరమ్మతులు, అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల వెనుక భాగంలో ఉన్న పొదలు, చెట్లు, కొండ ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచి, విద్యార్థుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు.బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నుంచి ప్రత్యేక ఆర్థిక సహాయం అందేలా ఇప్పటికే సంబంధిత ప్రతిపాదనలు పంపించామని, అర్హత మేరకు త్వరితగతిన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌తో సమన్వయం చేసుకొని పాఠశాలలో టాయిలెట్లు, బాత్ రూములు, భద్రతా గోడలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పరిపాలనా అనుమతులను (సాంక్షన్‌లు) తక్షణమే మంజూరు చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు.విద్యార్థుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న కలెక్టర్, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమగ్రంగా సమీక్షించి, అవసరమైన చోట మరమ్మతులు, అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని ఆమె వెల్లడించారు.

# భూభారతి, సాదాబైనామా దరఖాస్తులు నెలాఖరులోగా పరిష్కరించాలి

## కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్, ఆగస్టు 7 ::** భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తహసిల్దార్లను ఆదేశించారు. ప్రజావాణి, సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ (ఎఫ్ఆర్‌సీ) దరఖాస్తులను ఆగస్టు 17లోగా పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలని తెలిపారు. కస్టమ్ మిల్లింగ్‌కు కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి తనిఖీ చేయాలని, కొత్త తహసిల్దార్ కార్యాలయాల కోసం స్థలాలను గుర్తించి నివేదికలు పంపాలని ఆదేశించారు.సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన పలువురు తహసిల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన కలెక్టర్, అధికారులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.



# అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు.



**వలిగొండ ఆగస్టు 07 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ముద్దాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు అంగన్వాడి టీచర్ చీరిక సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యమని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రపాలు అమృతంతో సమానమని అన్నారు. శిశువుకు రోగనిరోధ శక్తిని అందిస్తాయని తెలిపారు. మొదటి ఆరు నెలల వరకు పసిబిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని కనీసం రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సామ సరస్వతి ఉపసర్పంచ్ బడక శ్రీనివాస్ పంచాయతి కార్యదర్శి మత్స్యగిరి ఏఎన్ఎం జే వినోద ఆశా కార్యకర్త గుంటోజు రామలీల ఆయా యాదమ్మ పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 7 :**వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వీటీఏడీఏ పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, శాఖల మధ్య సమన్వయంతో కార్మికుల సంఖ్య పెంచి పనుల్లో మరింత వేగం తీసుకురావాలని సూచించారు.నూతన గోశాల, గుడిచెరువు అభివృద్ధి–సుందరీకరణ, బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ, ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు 80 అడుగుల రహదారి విస్తరణ, మురుగు కాలువలు, విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా వైద్య కళాశాల, బాలుర–బాలికల హాస్టళ్లు, సిరిసిల్ల కోర్టు సముదాయం నిర్మాణాలను కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

### ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సీ ఇ ఓ వాసం వెంకటేశ్వర్లు,జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, ఆగస్టు,07:**
వికారాబాద్ జిల్లా లో ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన తెలంగాణ రాష్ట్ర అడిషనల్ సి ఇ ఓ వాసం వెంకటేశ్వర్లు,జిల్లా కలెక్టర్ దీపక్ తివారి.శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను అడిషనల్ సి ఇ ఓ వెంకటేశ్వర్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారి గార్ల తో కలిసి పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు.సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు.ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు.ఈ కార్యక్రమములో డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసు చంద్ర, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### రోగులకు మెరుగైన వైద్య సేవలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా

**హైదరాబాద్, ఆగస్టు 7 :):** కార్వాన్ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ దవాఖానలు, విద్యాసంస్థలను విస్తృతంగా తనిఖీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రులు, పాఠశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఔట్‌పేషెంట్ విభాగాలు, మాతా–శిశు విభాగం, ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. బాలింతలతో మాట్లాడి వైద్య సేవలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. టీబీ రోగులకు సమయానికి మందులు, పోషకాహారం అందేలా అవగాహన కల్పించాలని సూచించారు.రేషంబాగ్, ఖంగే కి బౌలి బస్తీ దవాఖానలు, ఆసిఫ్‌నగర్ యూపీహెచ్‌సీలను సందర్శించి ఔట్‌పేషెంట్ రద్దీ, మందుల లభ్యత, సిబ్బంది, మౌలిక వసతులను సమీక్షించారు. ఖాళీగా ఉన్న బస్తీ దవాఖాన వైద్యుల పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గోల్కొండ కటోరా హౌస్ ప్రాంతంలో దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలను పరిశీలించగా, రిసాలా బజార్‌లోని బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరిశుభ్రత లోపాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని, మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్‌ను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పానిపూర్ ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు.

## గాయత్రి స్కూల్లో ఘనంగా బోనాలు.



**వలిగొండ ఆగస్టు 07 :**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని గాయత్రి హైస్కూల్ బోనాలు విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుపుకునే చారిత్రక, సాంస్కృతిక జానపద పండుగ ఇది ప్రధానంగా ఆషాఢ మాసంలో మహాకాళి (పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ మొదలైన గ్రామదేవతలు) అమ్మవార్లకు నిర్వహించే కృతజ్ఞతా పూజ బోనం అంటే భోజనం అనే సంస్కృత వికృతి రూపమే బోనం ఇది అమ్మవారికి సమర్పించే నైవేద్యం కొత్త మట్టి లేదా రాగి కుండలో అన్నం, పాలు, బెల్లం వండుతారు.ఆ కుండను వేప ఆకులు, పసుపు, కుంకుమతో అలంకరిస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

## వలిగొండలో ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు.



**వలిగొండ ఆగస్టు 07 :**
యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకుడు బత్తిని నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డు పక్కన పెద్ద ఎత్తున కుంభం కీర్తిరెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేకు కట్ చేసిన అనంతరం ప్రజలకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ గౌడ్ మాట్లాడుతూ యువ నాయకురాలు కీర్తిరెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎల్లప్పుడు జరుపుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గప్రజలలో మంచి పేరు ఉండి దూసుకుపోతున్న కీర్తి రెడ్డి రాజకీయాలలో రాణించి ఉన్నత పదవులను పొందాలని నాగేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశంసత్తిరెడ్డి వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి వైస్ చైర్మన్ జంగారెడ్డి వలిగొండ ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్ నాయకులు పలుసం సతీష్ గౌడ్ కొండూరు భాస్కర్ గంగాపురం సతీష్ గౌడ్ సామ రామ్ రెడ్డివలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు గంగదారి రాములు బత్తిని లింగయ్య పబ్బు సురేందర్ కాసుల వెంకన్న కొండూరు సాయి ఎమ్మే లింగస్వామి రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ఘనంగా బోనాల వేడుకలు



**మేడ్చల్, ఆగస్టు 7 :):** తెలంగాణ రాష్ట్ర పండుగైన బోనాల వేడుకలను మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ ఆవరణలోని భువనేశ్వరీ మాత ఆలయంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు.పోతరాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ కార్యాలయం నుంచి ఆలయం వరకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళా సిబ్బంది అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యం డెలివరీలు వేగవంతం చేయాలి

### అదనపు కలెక్టర్ వి. రాములు



**మంచిర్యాల, ఆగస్టు 7 :):** జిల్లాలో సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం డెలివరీలను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లక్ష్యాలకు వెనుకబడిన మిల్లర్లు డెలివరీలను వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేసి ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యం డెలివరీలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలు ఎప్పుడు భర్తీ చేస్తారు?

- **సిబ్బంది కొరతపై పార్లమెంట్‌లో గళమెత్తిన వరంగల్ ఎంపీ కడియం కావ్య**
- **ఎంజీఎంలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రం**
- **ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయాలి.. కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలి**



**వరంగల్, ఆగస్టు 7 ::** వరంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల, మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రితో పాటు కేంద్ర సహకారంతో కొనసాగుతున్న ప్రభుత్వ వైద్య సంస్థల్లో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్ అధికారులు, పారామెడికల్ సిబ్బంది కొరతపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు.ఆయా వైద్య సంస్థల్లో మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గత మూడేళ్లలో ఖాళీల భర్తీ కోసం చేపట్టిన శాశ్వత, కాంట్రాక్టు నియామకాలు, ఇతర చర్యల వివరాలను కూడా ప్రశ్నించారు.ఎంపీ ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాధవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలని తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద రాష్ట్ర ప్రభుత్వాలు పంపే ప్రతిపాదనల ఆధారంగా కేంద్రం సాంకేతిక, ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు.వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి సంబంధించి మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలు హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా (HDI) నివేదికలో అందుబాటులో ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్యుల కొరతను అధిగమించేందుకు ప్రత్యేక అలవెన్సులు, ప్రోత్సాహకాలు, కాంట్రాక్టు నియామకాలు, 'యూ కోట్–వీ పే' వంటి విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**'బాధ్యత నుంచి తప్పించుకోవడం సమంజసం కాదు'...**

కేంద్రం ఇచ్చిన సమాధానంపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పందిస్తూ.. ఆరోగ్యం రాష్ట్ర అంశమని చెప్పి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడం సమంజసం కాదని అన్నారు.ఉత్తర తెలంగాణ ప్రజలకు కీలకమైన వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యులు, స్పెషలిస్టులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. సిబ్బంది కొరత కారణంగా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఎంజీఎం వంటి కీలక ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీల భర్తీకి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, తెలంగాణకు అవసరమైన అదనపు సహకారం అందించాలని ఎంపీ డా. కడియం కావ్య డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఆరోగ్య రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధ్యతలను రాష్ట్రాలపైకి నెట్టివేయకుండా కేంద్రం తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని, వైద్య సిబ్బంది ఖాళీలను యుద్ధప్రాతిపదికన భర్తీ చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాలనీల అభివృద్ధికి శ్రీకారం... రూ.2.65 కోట్లతో పనులు

- **సీసీ రోడ్లు, డ్రైనేజీతో మెరుగైన మౌలిక వసతులు**
- **వర్ధన్నపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం... ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వర్ధన్నపేట/వరంగల్, ఆగస్టు 7 ::**
వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.శుక్రవారం 1వ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్, శ్రీనివాస్ కాలనీ, ఆనందనగర్, పద్మావతినగర్, దుర్గకాలనీ ప్రాంతాల్లో రూ.2.65 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లలో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక వసతులతో పాటు విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.చాలాకాలంగా కాలనీల ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు.డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా పనులను పూర్తి చేయాలని అన్నారు.ప్రజా పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు



నిరంతరం కృషి చేస్తానని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము గౌడ్, జిల్లా కార్యదర్శి ఏరుకొండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేష్ గౌడ్, సీనియర్ నాయకులు దేవరకొండ అనిల్, గడ్డం శివరాం, పొన్నాల రఘు, గంట రాజిరెడ్డి, మూల తిరుపతిరెడ్డి, రవి యాదవ్, ఐలయ్య, రమేష్, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేడర్‌కు '60 శాతం' భరోసా!..పార్టీ సేవకు పదవుల గుర్తింపు!

- **ఏఐసీసీ నిర్ణయం చారిత్రాత్మకం.. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**
- **పీఏసీఎస్, మార్కెట్ కమిటీ పదవుల్లో సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం**



**హనుమకొండ, ఆగస్టు 7 ::** సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కష్టకాలంలోనూ అహర్నిశలు పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో 60 శాతం ప్రాధాన్యత కల్పించాలని ఏఐసీసీ తీసుకున్న నిర్ణయం పట్ల హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.ఢిల్లీలో జరిగిన ఏఐసీసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కల్పించే చారిత్రాత్మక నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పీఏసీఎస్ డైరెక్టర్లు, చైర్మన్లు, మార్కెట్ కమిటీలు తదితర నామినేటెడ్ పదవుల్లో 60 శాతం కోటాను పార్టీ కోసం పనిచేసిన వారికి కేటాయించి తొలి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతికూల పరిస్థితుల్లోనూ పార్టీ జెండాను మోస్తూ, సంస్థను బలోపేతం చేసేందుకు సుదీర్ఘకాలంగా సేవలందించిన నిజమైన కార్యకర్తలు, నాయకులకు ఈ నిర్ణయంతో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మాజీ మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గాల సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వారి సేవలను గుర్తించినట్లవుతుందన్నారు.అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని నిర్ణయించడం పార్టీ సామాజిక సమతుల్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా పార్టీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గ అభ్యర్థులు సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ ఆశావహుల తుది నివేదికను రూపొందించేలా స్పష్టమైన విధివిధానాలు రూపొందించడం అభినందనీయమని కొనియాడారు.క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల త్యాగాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్న ఏఐసీసీ ప్రతినిధి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్లకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ తరఫున ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడంతో భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని ఇనగాల వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ఆషాఢ బోనాలు.. అలరించిన విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మిరామానంద్**
- **ఆషాఢ బోనాలతో కళకళలాడిన బాలాజీ మహిళా కళాశాల**
- **సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల సందడి**



**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 7 ::** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని నర్సంపేట బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన బోనాల వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.కళాశాల విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను సమర్పిస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రామ్ రాజ్, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- **ఎం.టి.ఓ. ఆర్.ఐ. విజయ్ భాస్కర్**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు,**



**నారాయణపేట, ఆగస్టు,07:** నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎం.టి.ఓ. ఆర్.ఐ. విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు మోటార్ వాహన డ్రైవర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్.ఐ. విజయ్ భాస్కర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్లకు కేటాయించిన పెట్రోలింగ్ వాహనాలను సమర్థవంతంగా వినియోగిస్తూ నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, నేరాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో సైరన్ వినియోగిస్తూ ప్రజల్లో భద్రతా భావన కల్పించాలని సూచించారు.వాహనాలకు ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి డ్రైవర్ వాహనాల మెకానిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. విధుల్లో ఉన్న సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ తమకు కేటాయించిన వాహనాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచడంతో పాటు, నిర్ణీత వ్యవధిలో ఆయిల్ సర్వీసింగ్ తదితర నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో పై అధికారుల ఆదేశాల మేరకు వాహనాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటిస్తూ, నీట్ టర్నౌట్ యూనిఫాం ధరించాలని, ట్రాఫిక్ సైన్‌బోర్డులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు.అనంతరం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మోటార్ వాహనాల నిర్వహణ, మెకానిజం, భద్రతా ప్రమాణాలపై డ్రైవర్లకు ప్రాక్టికల్ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు వాహన డ్రైవర్లు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభం సొంత నిధులతో గుర్రపు డెక్క ఆకుతొలగింపు.



**వలిగొండ ఆగస్టు 07 :** యాదాద్రి భువనగిరి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వంతనిధులతో భీమ లింగం కాలువ వెంట గుర్రపు డెక్క ఆకును హిటాచి యంత్రం ద్వారా తొలగిస్తున్నారు. వలిగొండ చెరువు నుండి మొదలుకొని మల్లెపల్లి వెలవర్తి మొగిలిపాక మీదుగా ముద్దాపురం వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కె ఆకును తొలగించేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. భీమలింగం కాలువ పరిధిలోని రైతులు గుర్రపు డెక్క ఆకుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆకును తొలగిస్తేనే సాగునీరు అందుతుందని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని కలిసి ఆకును తొలగించాలని కోరడం తో ఆయన వెంటనే స్పందించి తొలగింపు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం వలిగొండ చెరువు వద్ద ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ఆధ్వర్యంలో హిటాచి వద్ద కొబ్బరికాయ కొట్టి ఆకుల తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఆకు తొలగింపుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరందింది బీడు పడిన భూములు సశశ్యామలం కానున్నాయి. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి వైస్ చైర్మన్ జంగారెడ్డి నాయకులు పలుసం సతీష్ గౌడ్ గంగాపురం సతీష్ గౌడ్ కంచనపల్లి ముద్దాపురం గ్రామాల సర్పంచులు రేసు బుచ్చిరెడ్డి సామ రాంరెడ్డి బత్తిని లింగయ్య పబ్బు సురేందర్ గౌడ్ కాసుల వెంకన్న గౌడ్ కొండూరు సాయి చిలుకూరుసత్తిరెడ్డి రైతులు పాల్గొన్నారు.

# నూతన FFS (Framework for Fertilizer Sale) యాప్ అమలు

- **మండల వ్యవసాయ అధికారి- జి తులసి దౌల్తాబాద్**

**దౌల్తాబాద్ మండలం, ఆగస్టు,07:** రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా మరియు సులభంగా నిర్వహించేందుకు ప్రభుత్వం శుక్రవారం నుండి నూతన Framework for Fertilizer Sale – FFS యాప్‌ను మొదటి విడతలో భాగంగా వికారాబాద్ జిల్లాలో అమల్లోకి తీసుకువచ్చింది.ఈ కొత్త వ్యవస్థలో ఎరువుల కొనుగోలు పూర్తిగా Farmer Registry ఆధారంగా జరుగుతుంది. రైతులు ముందుగా తమ ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ద్వారా e-KYC పూర్తి చేసి, భూమి వివరాలను ధృవీకరించుకోవాలి.అనంతరం పంటను ఎంపిక చేసుకొని, ప్రభుత్వ సిఫార్సు మేరకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని నమోదు చేసి, ఎరువుల విక్రయ కేంద్రంలో QR కోడ్ ద్వారా టోకెన్ బుక్ చేసుకొని ఎరువులు పొందవచ్చు.ఈ కొత్త విధానంలో రైతులకు వారి సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన ఎరువులు అందించబడతాయి. దీని ద్వారా ఎరువుల సమర్థ వినియోగం మరియు పారదర్శక పంపిణీ రైతులకు అందుబాటులోకి వస్తాయి.మండలంలోని అన్ని ఎరువుల విక్రయదారులు (రిటైలర్లు) నూతన FFS యాప్‌ను తప్పనిసరిగా వినియోగించి, రైతులకు పూర్తి సహకారం అందించాలని వ్యవసాయ శాఖ సూచించింది. అదేవిధంగా రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తమ వద్ద అందుబాటులో ఉంచుకొని, OTP ద్వారా ధృవీకరణ పూర్తి చేయాలని, ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని– మండల వ్యవసాయ అధికారి జి.తులసి కోరారు.




# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. వర్ధన్నపేటలో డివిజన్‌ల వారీగా ఇంచార్జ్‌ల నియామకం

- **వర్ధన్నపేట కాంగ్రెస్‌లో కమిటీల ఏర్పాటు...1, 65, 66వ డివిజన్లకు 7 మంది ఇంచార్జ్‌లు**
- **హన్మకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి**



**హనుమకొండ, ఆగస్టు 7 ::** టీపీసీసీ ఆదేశాల మేరకు వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) 1, 65, 66 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా డివిజన్లలో పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఏడుగురు సీనియర్ నాయకులను ప్రత్యేక ఇంచార్జ్‌లుగా నియమించినట్లు హనుమకొండ DCC అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు DCC వైస్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, DCC జనరల్ సెక్రటరీలు బిన్ని లక్ష్మణ్, మారంరెడ్డి కౌశిల్ రెడ్డి, DCC సెక్రటరీలు కట్ట రఘుపాల్ రెడ్డి, ముక్కెర సురేష్, కొక్కిరాల స్వాతి, DCC ఈసీ మెంబర్ కొత్త వాసుదేవ రెడ్డిలకు ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించినట్లు వెల్లడించారు. నియమితులైన ఇంచార్జ్‌లు తక్షణమే రంగంలోకి దిగి, ఆయా డివిజన్లలోని స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులోగా పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేయాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ కమిటీల ఏర్పాటు కీలకంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నియమితులైన ఇంచార్జ్‌లు సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆలేరు విద్యుత్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా

- **రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలి**

**ఆలేరు, ఆగస్టు 7::** రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలేరు విద్యుత్ కార్యాలయం (ఏడీఈ కార్యాలయం) ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందక పంటలు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 24 గంటల ఉచిత విద్యుత్ హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతులు రాత్రింబవళ్లు పొలాల వద్దే గడపాల్సి వస్తోందని, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు దెబ్బతిన్నప్పుడు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.ధర్నాలో ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు ఇక్కిరి సహదేవ్, చిరబోయిన రాజయ్య, సహాయ కార్యదర్శి మామిడాల బాలమల్లేష్, తమ్మడి అంజయ్య, కొమురయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి పద్మ సుదర్శన్, మేకల వెంకటేష్, నరేష్, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.




# విమలక్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

- **తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు - ఎర్రంపల్లి శ్రీనివాస్,**



**కొడంగల్ మున్సిపల్(మం)ఆగస్టు,07:** తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) కో చైర్పర్సన్ ప్రజా యుద్ధభేరి అరుణోదయ విమలక్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఏరన్ పల్లి శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు.తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) చైర్ పర్సన్, అరుణోదయ సంస్కృతిక సమాక్యా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు, ప్రజా యుద్ధభేరి పాటల పెద్దక్క కామ్రేడ్ విమలక్క 62 వ వేడుకలను పురస్కరించుకొని పూల బొకేతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఏరన్ పల్లి శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు,అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర కార్యదర్శి చెవిటి అనిత కుమారి, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బాధ్య లు కొర్ర పాండు నాయక్ లు మాట్లాడుతూ,,పేదల పక్షాన నిరంతరం బహుజనుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న విమలక్క మరెన్నో జన్మదినం వేడుకలు జరుపుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు సూర్య నాయక్, ఎల్ ఎస్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద నాయక్, అరుణోదయ కళాకారుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16న ములుగు జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- **అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: మంత్రి సీతక్క**




**ములుగు, ఆగస్టు 7 :):** ఈ నెల 16న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ములుగు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవురావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తదితరులతో కలిసి అన్ని శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ముఖ్యమంత్రి మేడారం వనదేవతలను దర్శించుకున్న అనంతరం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పంచాయతీరాజ్ హమ్ రోడ్ల పనులకు ములుగు నుంచే శ్రీకారం చుడతారని మంత్రి తెలిపారు. అలాగే నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు ఇంచర్ల గ్రామ శివారులో రూ.7 కోట్లతో నిర్మించిన ఇందిరమ్మ మహిళా శక్తి భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారని వెల్లడించారు.ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన అభివృద్ధి పనుల జాబితాను ఈ నెల 10లోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి, సీఎం పర్యటన పూర్తి షెడ్యూల్‌ను ఆగస్టు 12న ప్రకటిస్తామని తెలిపారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, మేడారం పరిసరాల్లో రహదారుల ఆక్రమణలను తొలగించి అనధికార వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అప్పాయిపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

**కొడంగల్ మండలం, ఆగస్టు,07:**



కొడంగల్ మండలం అప్పాయి పల్లి గ్రామంలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది శ్రీ రేణుక ఎల్లమ్మకు గ్రామస్తులు మహిళలు భారీ సంఖ్యలో బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు కానుకలు సమర్పించారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొడ్రాయి వెంకటయ్య ఉపసర్పంచ్ పకీరప్ప గ్రామస్తులు గోకుల్ సింగ్ దత్తు సింగ్ సంగప్ప కాషాయ గౌడ్ ప్రసాద్ శేఖర్ గౌడ్ భగవంతు రాములు మల్లేష్ గౌడ్ నర్సప్ప పకీరప్ప తదితర గ్రామస్తులు పాల్గొన్నారు



## మహిళలకు స్ఫూర్తి ప్రదాత

# సూర్యదేవర రాజ్యలక్ష్మి

### నేడు సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి వర్ధంతి

శతాబ్దాల శ్వేత జాతీయుల పాలనలో అష్టకష్టాలు అనుభవించి, ఆంగ్లేయుల దాస్య శృంఖలాలను తెంచు కునేందుకు ఎందరో పోరాట పటిమను, తెగువను చూపించారు. భారత స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పించారు. తమ సర్వస్వం స్వాతంత్ర సాధనకోసం త్యాగం చేసిన వారు ఎందరో ఉండగా, మగ వారితో సమానంగా కొంత మంది మహిళలు కూడా తెగించి స్వేచ్ఛా భారతం కోసం పోరాటం సల్పిన ఘన చరిత్ర ఉంది. సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు అధిక ప్రాముఖ్యత ఇచ్చే రోజుల్లో మహిళలు స్వతంత్ర పోరాటంలో పాల్గొని భారతదేశ పౌరుషాన్ని చాటిన సందర్భాలు మరచి పోలేనివి. తాము అబలలము కామని, త్యాగాలకు వెరవమని నిరూపించి, తెగించి బ్రిటీషర్లతో పోరాడారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాము లయ్యారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సేవకు రాలు సూర్యదేవర రాజ్యలక్ష్మీ దేవి ముఖ్యులు.

సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (మే 18, 1914 – ఆగష్టు 8, 2010) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా వీరుల పాడులో మే 18, 1914లో వాసిరెడ్డి సీతా రామయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. ఆమె గురువు అతను కవి, పండితుడు జంగా హనుమ య్య చౌదరి ఉత్తమ విషయ పరిజ్ఞానాన్ని బోధించి, విద్వత్తు కలిగించారు. సూర్య దేవర నాగయ్యతో రాజ్యలక్ష్మీ దేవికి పదేళ్ళ వయస్సులో వివాహ మై, ఆమెక 16 ఏళ్ళకు అత్తవారింటికి వచ్చేవరకు విద్యా వ్యాసంగాలు కొన సాగించారు. వీరులపాడులో గ్రంథాలయాన్ని వినియోగించు కుని, తాపీధర్మారావు, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, త్రిపురనేని రామ స్వామి చౌదరి వంటి సంఘ సేవకులు రచించిన గ్రంథాలను రాజ్యలక్ష్మీదేవి ప్రతి రోజూ తెచ్చుకుని చదివి అవగాహన చేసుకునేవారు. ఇవన్నీ ఆమెలో స్వతంత్ర్య భావాలను, స్వేచ్ఛాభిలాషను పెంచాయి. 1920లో గాంధీజీ ఇచ్చిన పిలుపు విని దేశసేవకు నడుం బిగించారు. 1930లో ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొనాలని అనుకున్నా, ఆమె జైలుశిక్ష అనుభవించటానికి, సత్యా గ్రహం చేయటానికి భర్త, ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. రాట్నంపై నూలు వడకటం, హిందీ నేర్చుకోవటం, ఖాదీ ధారణ అక్కడ పరిపాటి. ఉద్యమం ప్రచారం చేస్తూ రాజ్యలక్ష్మీదేవి దగ్గర బంధువటైన అన్నపూర్ణమ్మతో శాసనోల్లంఘన చేయతల పెట్టారు. జాతీయ గీతాన్ని ఆలపిస్తూ శాసనధిక్కార నినాదాలు ఊరేగింపుగా వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు.

శిక్ష గురించి న్యామూర్తుల ఇళ్ళలో సైతం స్త్రీలు వీరికి అండగా నిలవడంతో ఆ శిక్ష రద్దు చేసి నామమాత్రపు శిక్షను విధించగా, రాజ్యలక్ష్మీదేవిని రాయవేలూరు జైలుకు తరలించారు. రాజ్యలక్ష్మి ఖాదీ ప్రచారం, మహిళా ఉద్యమం, రాజకీయ కార్యకలాపాలు కొనసాగిస్తూ, కష్టపడి చదివి రాష్ట్రభాష పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అస్పృశ్యతా నివారణ కోసం ఆమె తన వంతు కృషి చేశారు. హరిజన స్త్రీలను అందరితో పాటు గౌరవించేవారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. గుంటూరు జిల్లాలో ఆ సత్యా గ్రహం చేయడానికి అనుమతి లభించిన తొలిస్త్రీ రాజ్యలక్ష్మి. 1941 జనవరి 30లో బాపట్ల తాలూకాలోని బ్రాహ్మణ కోడూరులో ఆమె సత్యాగ్రహం చేశారు. పోలీసులు అరెస్ట్ చేసి, రెండు నెలల జైలు శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు.

ఆమె జైల నుండి విడుదలటై మద్రాసులోని ఆంధ్ర మహిళా సభకు చేరుకున్నారు. తరువాత తెనాలి వెళ్ళి ట్యుటోరియల్ కాలేజిలో చేరి బెనారస్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఆమె చేబ్రోలు కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉండి మహిళా భ్యున్నతికి దేశాభ్యు దయానికి పాటు పడ్డారు. క్విట్ ఇండియా ఉద్యమంలో రాజ్యలక్ష్మీదేవిని శాసనధిక్కార శాఖ సభ్యురాలిగా నియమించారు. ఆమె రహస్యంగా జిల్లాలన్నీ తిరిగి ప్రజలచే శాసన ధిక్కారం చేయించారు. పోలీసుల నుండి ఆమెను దేశభక్తులు కాపాడే వారు. రాజ్యలక్ష్మీదేవి 1941లో చేబ్రోలులో జాతీయ మహిళా విద్యాలయాన్ని స్థాపించారు. ఆ తరువాత అక్టోబరు 1945లో ఆంధ్ర రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాలను ప్రారంభించారు.

భారత దేశానికి 1947 ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్యం సిద్ధించినా, నైజాము ఏలుబడిలో ఉన్న వారికి విముక్తి కలగలేదు. రాజ్యలక్ష్మీదేవి విరాళాలు, చందాలు పోగుచేసి నైజాం వ్యతిరేక పోరాట నాయకు లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. రాజ్యలకీదేవి వ్యక్తి గతంగా నైజాం వెళ్ళి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాదు సంస్థానం స్వతంత్ర భారత దేశంలో విలీనమయ్యే వరకు ఆమె అక్కడి వారితో కలసి పోరాటం సాగించారు. 1950లలో తెలుగు దేశం అనే పత్రిక నడిపారు. మహిళాభ్యుదయ సంస్థలో మల్లాది సుబ్బమ్మ తదితరు లతో కలిసి మద్యపానానికి వ్యతిరేకముగా పోరాటం చేశారు. రాజ్యలక్ష్మి ఆగష్టు 8, 2010 న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలంగాణ బతుకును అక్షరాల్లో నిలిపిన యశోద

### నేడు పాకాల యశోదారెడ్డి జయంతి

ఆమె తెలంగాణ గర్వించ దగిన సాహితీ మూర్తి. తెలంగాణ సజీవ భాషను తన రచనల్లో వాడి పలువురి మన్ననలు పొందిన సాహితీవేత్త. ఆకాశవాణిలో తెలంగాణ మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయితగా పేరు గడించారు. తెలుగు ప్రాచీన సాహిత్యంపై ఆమె చేసిన ప్రసంగాలు బహు పండిత ప్రశంసా పాత్రాలు అయినాయి. ఆమె పలు రచనలు మన్ననలకు నోచుకున్నాయి. ఆమే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షురాలుగా పని చేసి గుర్తింపు పొందిన పాకాల యశోదారెడ్డి.

"పాకాల యశోదారెడ్డి సంస్కృతాంధ్ర భాషల్లో విదుషీ మణి, పరిశోధకురాలు, సాహిత్య విమర్శకురాలు. వచన కవిత్వం కూడా వ్రాసారు. . ఆమె వేదికలమీద అనర్గళంగా ఉపన్యసించి మంచి వక్తగా పేరు తెచ్చుకున్నారు. ఆమె వాగ్ధాటికి శ్రోతలు తన్మయులయ్యే వారు. అచ్చమైన తెలుగు, సుదీర్ఘమైన సంస్కృత సమాసాలతో కూడిన ప్రసంగాలు విన ఇంపుగా ఉండేది. ఆమె దివాకర్ల వేంకటవధాని శిష్యురాలు. 1950 దశకారంభం నుంచే ఆమె ఆలిండియా రేడియోలో "మహాలక్ష్మి ముచ్చట్లు" అని వినిపించేది.

యశోదా రెడ్డి (ఆగష్టు 8, 1929 – అక్టోబర్ 7, 2007) ప్రముఖ రచయిత్రి. ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేసి, పదవీ విరమణ గావించారు. పలు సాహిత్య విమర్శనా గ్రంథాలు రాశారు. కథా సంపుటాలను వెలువరించారు. పాకాల

యశోదారెడ్డి 1929, ఆగష్టు 8 న పాలమూరు జిల్లా ( నాగర్‌కర్నూల్ జిల్లా), బిజినేపల్లిలో సరస్వతమ్మ, కాశిరెడ్డి దంపతులకు ఆమె జన్మించారు. యశోదారెడ్డి మూడవ తరగతి వరకు మహబూబ్ నగర్ లో, ఉన్నత పాఠశాల విద్యను హైదరాబాద్, నారాయణగూడ లోని బాలికల ఉన్నత పాఠశాలలోను పూర్తి చేశారు. రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి ప్రోత్సాహంతో కళాశాల విద్య కొనసాగించి, ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి తెలుగు, సంస్కృత భాషలలో స్నాతకోత్తర విద్య పూర్తి చేశారు. జర్మన్ భాషలో, భాష శాస్త్రంలో డిప్లొమా చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం లోనే తెలుగులో హరివంశాలు" అను అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. 1976లో అలీఘర్ విశ్వ విద్యాలయం నుండి డి.లిట్ అందుకున్నారు. యశోదారెడ్డికి హిందీ, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రావీణ్యంతో పాటు, జర్మన్ భాష తో కూడా పరిచయం ఉండేది. ఆమె భర్త ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పి. టి. రెడ్డి గా సుపరిచితులైన పాకాల తిరుమల్ రెడ్డి. జె.జె.ఆర్ట్ కళాశాలలో చదువుకుని, కొన్నాళ్ళు లాహోర్లో పనిచేసి హైదరాబాదు తిరిగి వచ్చిన



తిరుమలరెడ్డి, ఆమె వక్తృత్వ ప్రతిభను చూసి, పి.టి.రెడ్డి ఆకర్షితుడై 1947లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తిరుమల్ రెడ్డి గీసిన అనేక చిత్రాలకు ఆమే స్ఫూర్తి. యశోదారెడ్డి కూడా స్వతహాగా కళాపిపాసి. ఆమె రకరకాల ఇత్తడి విగ్రహాలను హాబీగా సేకరించే వారు. పి.టి రెడ్డి సాంగత్యంతో వాటిలోని కళానైపుణ్యాన్ని, వైటభవాన్ని ఆమె గుర్తించ గలిగేవారు. భర్త చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేసినపుడు ఒక కార్యకర్తగా పని చేసి అది విజయవంతం అయ్యేందుకు దోహదపడేది.

1955లో హైదరాబాద్, కోఠి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగ జీవితం ప్రాంభించారు. తరువాత రీడర్‌గా, ప్రొఫెసర్‌గా ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పనిచేసి, ఎందరో పరిశోధకులకు మార్గదర్శియై, 1989లో పదవీ విరమణ పొందారు. ఆమె ధర్మశాల, ఎచ్చుమ్మ కథలు తదితర కథా సంపుటాలను వెలువరించారు. యశోదా రెడ్డి వందకు పైగా కథలు వ్రాసినా వాటిలో 63 మాత్రమే పుస్తక రూపంలో రావడం జరిగింది. ఆమె ప్రచురించిన మూడు కథా సంపుటాల్లో, మావూరి ముచ్చట్లు (1973) కథా సంపుటి 1920–40 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే, ఎచ్చుమ్మ కథలు (1999) 1950–70 నాటి తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు, ధర్మశాల (2000) కథా సంపుటి 1980–1990 నాటికి తెలంగాణ సమాజంలో వచ్చిన మార్పులకు దర్పణం పట్టింది. ఈ మూడు కథా సంపుటాల్లో ఈమె తెలంగాణ భాషను, యాసను, సంస్కృతిని, సామాజిక జీవితాన్నిఅక్షర బద్ధం చేశారు. మావూరి ముచ్చట్లు, ఎచ్చుమ్మ కథలు, పాలమూరు జిల్లా మాండలికంలో వ్రాస్తే, ధర్మశాల కథా సంపుటిని మాత్రం వ్యవహారిక తెలుగు భాషలో లిఖించారు. యశోదారెడ్డి కథలు తెలంగాణ జనజీవన సంస్కృతిను, తెలంగాణా మాండలిక నుడికారానికి అద్దం పడతాయి. ఎచ్చుమ కథలకు ముందుమాటలో "ఒక జాతి సంస్కృతిలో ఆ జాతి జీవన విధానం ప్రతిఫలిస్తుంది. ఈ సంస్కృతీ సర్వస్వం ఆ జాతి భాషలో నిక్షిప్తమై జీవిస్తుంది. ఆ భాష ఆ జాతికి ప్రత్యేకమైన ఆచార వ్యవహార, ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలధాతువులను జీర్ణించుకొని రససిద్ధిని పొంది జాతీయాల్లో, పలుకుబళ్లలో, సామెతల్లో పొందుపడి ప్రభుత్వాన్ని నెరుపుతుంది. ఒక భాషలో ఒక నానుడి కానీ, సామెత కానీ, జాతీయం కానీ అలవోకగా పుట్టదు. ఆయా జాతీయులు, తలలు పండినవారి అనుభవాన్ని వీడబోసి నిగ్గుదేల్చిన సారమే ఈ నుడికారపు ఇంపుసొంపులు. అందుకే అవి భాషకు జీవనాడి. ప్రాణ ధాతువుల వంటివి అని అభిప్రాయడిన యశోదారెడ్డి...తన కథల నిండా తెలంగాణ నుడికారపు సొంపులకు పెద్దపీట వేశారు. యశోదారెడ్డి కథారచయిత్రిగానే కాకుండా కవయిత్రిగా కూడా ప్రసిద్ధులే. ఆమె రాసిన కవితలు అనేక పత్రికలలో ముద్రించ బడ్డాయి. స్వయంగా తానే తన కవితలను ' ఉగాదికి ఉయ్యాల , భావిక అనే రెండు సంపుటాలగా వెలువ రించారు. మలేషియాలో జరిగిన తెలుగు సమ్మేళనంలో కవయిత్రిగా పాల్గొని, ప్రశంసలందు కున్నారు. పారిజాతా పహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియా స్వరూపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహించి, విలువైన పీఠికలను రాసి, వెలువరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ, లలిత కళా అకాడమీ, సంగీత అకాడమీలలో సభ్యురాలిగా పని చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్, జానపద కళా సాహిత్య సంస్థలతో ఆమెకు అనుబంధం ఉండేది. యశోదారెడ్డి 2007, అక్టోబర్ 7 న హైదరాబాదులో మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పద్యానికి పట్టాభిషేకం చేసిన చెళ్లపిళ్ల

### నేడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జయంతి

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయులైన మహాకవి. పద్య రచన, ప్రబంధ కావ్యాలు, నాటక సాహిత్యం, అవధాన విద్య తదితర ప్రక్రియల్లో తనదైన ముద్రవేసిన గొప్ప ప్రతిభాశాలి. 1870 ఆగస్టు 8న కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో జన్మించిన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి బాల్యంలో నుంచే పద్య సాహిత్యంపై మక్కువతో తెలుగుతో పాటు సంస్కృత భాషలోనూ విశేష పాండిత్యం సంపాదించాడు. ఈ పాండిత్యమే ఆయన సాహిత్య కృషికి గట్టి పునాది వేసింది. తెలుగు భాషలోని ఛందోబద్ధతకు, శబ్ద సౌష్ఠవానికి, భావ పరిపక్వతకు ప్రతీకగా ఆయన రచనలు నిలిచాయి.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి జీవితంలో కీలక ఘట్టం దివాకర్ల తిరుపతి శాస్త్రితో ఏర్పడిన సాహిత్య బంధం. వీరిద్దరూ కలసి తిరుపతి వేంకట కవులు అనే పేరుతో ప్రసిద్ధి పొందారు. జంట కవులుగా వీరిద్దరి అవధానాలు, పద్య ధారణలు, సభాభినయాలు అప్పటి సమాజంలో విశేష ఆదరణ పొందాయి. రాజ దర్శనాల వేదికలపై, ప్రజా సభలవద్ద వీరు నిర్వహించిన అవధానాలు సాహితీ మేధస్సుకు అద్దంపట్టేలా ఉండేవి. ప్రశ్నలకు శీఘ్ర ప్రతిస్పందన, ఛందోబద్ధమైన పద్య సమాధానాలు, చమత్కారంతో కూడిన పద చిత్రణలు వీరి ప్రతిభకు నిదర్శనాలుగా నిలిచాయి. జనుల మధ్య సాహిత్యాన్ని సులభంగా అందించే విధానం వీరిద్దరి రచనలలో కనిపిస్తుంది.

తిరుపతి వేంకట కవుల రచనలు సాంప్రదాయాన్ని కాపాడుతూ, నవీన భావజాలానికి తలుపులు తెరిచినవిగా నిలిచాయి. ముఖ్యంగా పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవ రాజసూయము, పాండవోద్యోగము, పాండవ విజయము, పాండవ అశ్వమేధము అనే నాటకాలుగా రచించారు. నాటకాలు మహాభారత ఇతివృత్తాలను ఆధారంగా తీసుకుని రచించబడ్డవి. వీటిలో పాత్రల వ్యక్తిత్వం, మానవీయత, నైతిక విలువలు నాటకీయంగా అభివ్యక్తమయ్యాయి. బుద్ధ చరిత్ర అనే కావ్యంలో గౌతమ బుద్ధుని జీవితం, తాత్త్వికత, సందేశాత్మకత అద్భుతంగా ప్రతిబింబించ బడింది. శ్రవణానందం అనే ప్రబంధంలో శ్రవణ కుమారుని పితృభక్తిని, త్యాగాన్ని పరిచయం చేశారు. నానారాజ సందర్శనం అనే గ్రంథంలో తాము జీవితంలో కలిసిన అనేక రాజులు, పండితులతో జరిగిన పరిచయాలను, అనుభవాలను చమత్కార భరితంగా వర్ణించారు. కథలు గాథలు(వేంకటశాస్త్రి వచన రచనల సంకలనం) "ఒక అర్ధశతాబ్దిలో తెలుగు



సాంస్కృతిక చరిత్ర" అంటూ పుస్తకం వెనుక అట్టపై ప్రచురణకర్తలు ప్రశంసించారు. ఈ రచనలన్నీ పద్యం, గంభీరత, సరళత, శైలి, శబ్ద సౌష్టవం వంటి లక్షణాల్లో అత్యుత్తమంగా నిలిచాయి.

అవధాన కళను కేవలం మేధో ప్రదర్శనంగా కాకుండా సాహిత్య వినోదంగా తీర్చిదిద్దిన ఘనత చెళ్లపిళ్ల వేంకటశాస్త్రికే చెందుతుంది. పద్యధారణలో అతిశయోత్సాహం, పదచాతుర్యం, వ్యాకరణ పరిపూర్ణత, భావ వైవిధ్యం కలగలిపిన ఆయన శైలి తెలుగు పద్యసాహిత్యంలో విలక్షణంగా నిలిచి ఉంటుంది. ప్రజల మధ్య సాహిత్యాన్ని గాంభీర్యంతో పాటు వినోదాత్మకంగా పరిచయం చేసిన మేధావిగా ఆయన పేరు నిలిచిపోయింది. సభికులను ఆశ్చర్యానికి గురిచేసేలా పద్య సమాధానాలు చెప్పే సామర్థ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. శతావధానాలు, దశావధానాలు నిర్వహిస్తూ మేధో ప్రతిభను సాహిత్యానికీ వినోదానికీ అనుసంధానించిన వారు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి.

ఆయన పద్యాల్లో సంస్కృత నుపురనాదం వినిపించినా, ప్రజల భాషగా తెలుగు మాధుర్యాన్ని మరచిపోలేదు. ఛందస్సులో నియమనిష్ఠ, శబ్దచిత్రాల ద్వారా భావ వ్యాప్తి, సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే సరళ శైలి ఆయన రచనల్లో కనిపిస్తాయి. హాస్యము, వ్యంగ్యము, భక్తి, నీతి, చమత్కారంతో కలిపిన పద్యాలు ఆయన ప్రత్యేకత. ఆయన రచనలు కేవలం పాఠ్యపుస్తకాల వరకే పరిమితం కాక, వేదికల మీద వినిపించే పద్యాల్లోనూ ప్రబలంగా వినిపించాయి. ఆయన కవిత్వం ప్రజా సాహిత్యానికి, పాండిత్య సాహిత్యానికి మధ్య ఉన్న అంతరాన్ని కలుపుతుందనడం అతిశయోక్తికాదు.

చెళ్లపిళ్ల సమకాలికులైన వేదం వేంకటరాయశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం లాంటి సాహిత్య ప్రముఖుల మాదిరిగా ఆయన రచనల్లోనూ ఆధునికత, సామాజిక స్పృహ, జీవన విధానాలు ప్రతిఫలించాయి. అయితే ఆయన పద్యరచన శైలిలో సాంప్రదాయ భావాలనూ, నూతన రచనా తత్త్వాన్నీ సమపాళ్లలో మేళవించగల సమర్థత ఉంది. అలాంటి శైలికి ఉదాహరణగా బుద్ధ చరిత్ర, శ్రవణానందం వంటి రచనలు నిలిచాయి. పాండిత్యంతో పాటు ప్రజల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని, సాహిత్యాన్ని అందరికీ నచ్చేలా మార్చిన శిల్పి ఆయన.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి బందరు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేయగా, వేంకటశాస్త్రి వద్ద విద్యను అభ్యసించి, సాహిత్య రంగంలో, భాషాశాస్త్రంలో కవులుగా, రచయితలుగా, పండితులుగా లబ్ధప్రతిష్ఠులైన వారిలో విశ్వనాథ సత్యనారాయణ, వేటూరి ప్రభాకరశాస్త్రి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు, వేలూరి శివరామశాస్త్రి, శ్రీరాముల సచ్చిదానందం, అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి వంటి మహామహులు ఉన్నారు.

1950 జూన్ 16న చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి పరమపదించారు. కానీ ఆయన సాహిత్య రచనలు, పద్య శైలి, అవధాన కళా వైభవం తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానాన్ని పొందాయి. నేటికీ ఆయన రచనలు పాఠశాలలు, కళాశాలల పాఠ్య గ్రంథాల్లో ఉన్నాయి. అవి అధ్యయనానికి, పరిశోధనలకు ప్రేరణగా నిలుస్తున్నాయి. సమగ్రంగా చూస్తే, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కవిత్వంలో మాధుర్యం, మేధోప్రభ, భక్తి, హాస్యం, శైలీ నైపుణ్యం కలగలిపి ఉంటాయి. తెలుగు భాషా సాహిత్యాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాపింప జేసిన మహనీయుడు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి. ఆయన పేరు తెలుగు పద్య సాహిత్యంలో అమరంగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు

శనివారం 08.08.2026

# లంక బ్యాటర్ల దంచికొట్టుడు




- ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లకు చుక్కలు
- తొలి రోజే 363 పరుగులతో ఆతిథ్య జట్టు పట్టు
- ముగ్గురి అర్ధశతకాలు.. తొలి వికెట్‌కు 110 పరుగులు
- స్పిన్నర్లకు తలో రెండు వికెట్లు.. సుథార్ పొదుపైన బౌలింగ్
- గాయం కారణంగా బరిలోకి దిగని కెప్టెన్ గిల్

**కొలంబో, ఆగస్టు 7:** టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు గట్టి హెచ్చరికలే పంపారు. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి రోజే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక ఎలెవన్ ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. ఓపెనర్లు రవిందు రసంత, నిషాన్ మదుష్కతో పాటు కెప్టెన్ సోనాల్ అర్ధశతకాలతో చెలరేగడంతో భారత బౌలర్లు పరుగుల ప్రవాహాన్ని కట్టడి చేయలేకపోయారు.

## ఓపెనర్ల నుంచే ఎదురుదాడి

శ్రీలంకకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. రవిందు రసంత, నిషాన్ మదుష్క భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 110 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. రసంత 143 బంతుల్లో 71 పరుగులు చేయగా, మదుష్క 66 పరుగులతో రాణించారు. అనంతరం కెప్టెన్ సోనాల్ 51 పరుగులతో జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. భారత బౌలర్లలో మానవ్ సుథార్ ఆకట్టుకున్నాడు. 13 ఓవర్లలో కేవలం 33 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ కూడా చెరో రెండు వికెట్లు దక్కించుకున్నారు. గుర్నూర్ బ్రార్‌కు ఒక వికెట్ లభించింది. అయినప్పటికీ లంక బ్యాటర్లను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు.

## గిల్‌కు విశ్రాంతి

ప్రాక్టీస్ సెషన్‌లో కుడిచేతి వేలికి గాయమైన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి రోజు ఆటకు దూరంగా ఉన్నాడు. దీంతో కేఎల్ రాహుల్ తాత్కాలికంగా జట్టు బాధ్యతలు చేపట్టాడు. గిల్ గాయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి వైద్య బృందం పర్యవేక్షిస్తోంది.

## పిచ్‌పై భారత్ అసంతృప్తి!

ప్రాక్టీస్ మ్యాచ్‌కు సిద్ధం చేసిన పిచ్‌పైనా భారత జట్టు యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. సాధారణంగా శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయి. అయితే ఈ మ్యాచ్ పిచ్‌పై ఎక్కువ గడ్డి ఉండటంతో స్పిన్నర్లకు ఆశించిన సహకారం లభించలేదు. ప్రధాన టెస్టుల్లో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లు ఎదురయ్యే అవకాశముండగా, సన్నాహక మ్యాచ్‌కు భిన్నమైన పిచ్ ఇవ్వడం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కదని భారత జట్టు భావిస్తోంది. రెండు టెస్టుల సిరీస్‌కు ముందు సరైన బౌలింగ్ కూర్పును నిర్ణయించుకోవడంతో పాటు స్థానిక పరిస్థితులకు అలవాటుపడేందుకు ఈ మూడు రోజుల మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది.

# కోహ్లీ అండతోనే నా పంచ్‌కు పదును!

- కష్టకాలంలో మూడేళ్లు అండగా నిలిచిన విరాట్
- ఆర్థిక భరోసాతో ఆటపైనే పూర్తిగా దృష్టి
- ఆయన క్రమశిక్షణే నాకు స్ఫూర్తి: సాక్షి చౌదరి
- కామన్వెల్త్ స్వర్ణ విజేత భావోద్వేగ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించి కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన సాక్షి చౌదరి తన విజయ ప్రయాణం వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో అత్యంత క్లిష్ట సమయంలో అండగా నిలిచారని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు ఆయన అందించిన ఆర్థిక సహకారం వల్ల ఇతర సమస్యల గురించి ఆలోచించకుండా పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టగలిగానని భావోద్వేగానికి గురైంది. ఐఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాక్షి చౌదరి మాట్లాడుతూ విరాట్ కోహ్లీ తనకు ఆదర్శమని పేర్కొంది. కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో కోహ్లీ, ఆయన ఫౌండేషన్ తనకు అండగా నిలిచాయని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు స్పాన్సర్‌గా వ్యవహరించడం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందని చెప్పింది. ఆ సహకారం వల్ల శిక్షణ, పోటీలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగలిగానని సాక్షి వివరించింది. తన ప్రయాణంలో కోహ్లీ అందించిన మద్దతును ఎప్పటికీ మరిచిపోలేనని, జీవితాంతం ఆయనకు కృతజ్ఞురాలిగా ఉంటానని పేర్కొంది. మైదానంలో విరాట్ కోహ్లీ చూపించే క్రమశిక్షణ, నిలకడ తనను ఎంతగానో ప్రభావితం చేశాయని సాక్షి తెలిపింది. ఒత్తిడి ఎంత ఉన్నా లక్ష్యంపై దృష్టి కోల్పోకుండా ముందుకు సాగే కోహ్లీ తీరు తనకు స్ఫూర్తినిస్తుందని చెప్పింది. ఆయన నుంచి లభించిన మద్దతు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు దోహదపడిందని పేర్కొంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో మహిళల 51 కిలోల విభాగంలో సాక్షి చౌదరి స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్లో ఇంగ్లాండ్ బాక్సర్ రూబీ వైట్‌ను ఓడించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత బాక్సింగ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సాక్షి వ్యాఖ్యలతో కోహ్లీ ప్రోత్సాహం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువ క్రీడాకారుల ప్రయాణానికీ అండగా నిలుస్తోందన్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# శ్రేయస్‌కు 'మిస్టర్ కూల్ 2.0' కితాబు

- ధోనీ తర్వాత అంతటి 'కూల్' కెప్టెన్ అయ్యరే!
- ఓటముల్లోనూ ప్రశాంతతే అతడి అసలైన బలం
- యువ ఆటగాళ్లపై ఒత్తిడి కాదు.. పూర్తి స్వేచ్ఛ
- అరుపులు.. కేకలు ఉండవు.. అండగా నిలిచే నాయకత్వం
- అయ్యర్ కెప్టెన్సీపై ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత క్రికెట్‌లో 'కెప్టెన్ కూల్' అనగానే గుర్తుకొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. ఎంతటి ఉత్కంఠభరిత పరిస్థితుల్లోనైనా ముఖంలో భావోద్వేగాలు కనిపించనివ్వకుండా జట్టును నడిపించడం ధోనీ ప్రత్యేకత. ఇప్పుడు అదే తరహా ప్రశాంతత శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోనూ కనిపిస్తోందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసించాడు. ధోనీ తర్వాత అంతటి కూల్ కెప్టెన్‌గా అయ్యర్ కనిపిస్తున్నాడంటూ కితాబిచ్చాడు. భారత టీ20 జట్టు నాయకుడిగా శ్రేయస్ అయ్యర్ ప్రశాంతత, సానుకూల దృక్పథమే అతడి కెప్టెన్సీని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని చోప్రా పేర్కొన్నాడు. జూన్ 2026లో సూర్యకుమార్ యాదవ్ నుంచి భారత టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన అయ్యర్‌కు ఆరంభంలో ఆశించిన ఫలితాలు దక్కలేదు. నాయకత్వం చేపట్టిన తొలి తొమ్మిది మ్యాచ్‌ల్లో భారత్ కేవలం రెండు విజయాలే సాధించింది. అయినప్పటికీ జట్టులో ప్రతికూల వాతావరణం ఏర్పడకుండా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపడంలో అయ్యర్ పరిణతి చూపిస్తున్నాడని వివరించాడు. 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో' కార్యక్రమంలో ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. అయ్యర్ నోటి నుంచి సాధారణంగా ప్రతికూల వ్యాఖ్యలు రావని చెప్పాడు. మనం మాట్లాడే మాటలకు కూడా ప్రభావం ఉంటుందని, సానుకూలంగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయనే భావనను అయ్యర్ బలంగా నమ్ముతాడని పేర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆటగాళ్లపై సహజంగానే తీవ్ర ఒత్తిడి ఉంటుందని, అలాంటి సమయంలో కెప్టెన్ లేదా కోచ్ మరింత ఒత్తిడి పెంచకుండా వారిని ప్రశాంతంగా ఉంచడం అత్యంత ముఖ్యమని చోప్రా అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛనిస్తూ వారిలోని అత్యుత్తమ ఆటను బయటకు తీసుకురావడానికి అయ్యర్ ప్రయత్నిస్తున్నాడని ప్రశంసించాడు. మైదానంలో నిరంతరం అరవడం, ఆటగాళ్లపై అసహనం ప్రదర్శించడం కాకుండా తప్పులు చేసినా వారికి అండగా నిలిచే నాయకుడినే యువ క్రికెటర్లు కోరుకుంటారని చోప్రా పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్ సరిగ్గా అలాంటి నాయకుడేనని వ్యాఖ్యానించాడు. విజయాలు వెంటనే రాకపోయినా అయ్యర్ అనుసరిస్తున్న ప్రశాంతమైన నాయకత్వ విధానం దీర్ఘకాలంలో భారత జట్టుకు మేలు చేస్తుందని చోప్రా అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని పెంచడంలో అతడి విధానం కీలకంగా మారుతుందన్నాడు. ఒత్తిడిలోనూ ధోనీ ఎంత ప్రశాంతంగా కనిపించేవాడో, అయ్యర్‌లోనూ అలాంటి లక్షణాలే కనిపిస్తున్నాయని పేర్కొంటూ.. భారత క్రికెట్‌కు మరో 'మిస్టర్ కూల్' దొరికినట్లేనని ప్రశంసించాడు.



# రిటైర్మెంట్ రోజే స్టీవ్ వా ఫోన్!

## రహానే కెరీర్‌కు ఊహించని కొత్త మలుపు
## ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ నుంచి ఆడేందుకు గ్రీన్‌సిగ్నల్
## పరుగుల కోసమే కాదు.. యువ ఆటగాళ్లకు మార్గదర్శకత్వమే లక్ష్యం
## ఆగస్టు 26 నుంచి యూరప్‌లో కొత్త ఇన్నింగ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజే భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానేకు ఊహించని అవకాశం తలుపుతట్టింది. ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ స్టీవ్ వా నుంచి వచ్చిన ఒక్క ఫోన్ కాల్ రహానే క్రికెట్ ప్రయాణానికి కొత్త మలుపు ఇచ్చింది. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున బరిలోకి దిగేందుకు రహానే సిద్ధమయ్యాడు. తాను రిటైర్మెంట్ ప్రకటించిన రోజే స్టీవ్ వా స్వయంగా ఫోన్ చేసి ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్‌లో చేరాలని ఆహ్వానించినట్లు రహానే వెల్లడించాడు. ఆ ప్రతిపాదనపై ఒక రోజు ఆలోచించిన తర్వాత అంగీకరించినట్లు తెలిపాడు. మరో టీ20 లీగ్‌లో ఆడే అవకాశంగా మాత్రమే కాకుండా తన సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవాన్ని యువ క్రికెటర్లతో పంచుకునే వేదికగా దీనిని చూస్తున్నట్లు చెప్పాడు.

## పరుగులే కాదు.. అనుభవం పంచేందుకూ

38 ఏళ్ల రహానే తాను యూరప్‌కు కేవలం పరుగులు చేసేందుకు మాత్రమే వెళ్లడం లేదని స్పష్టం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా సంపాదించిన అనుభవాన్ని యువ ఆటగాళ్లకు అందించడం, వారికి మార్గదర్శకుడిగా నిలవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. తన ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు కొత్త తరానికి ఉపయోగపడితే అదే తనకు గొప్ప సంతృప్తి అని తెలిపాడు. ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి జట్లు అంతర్జాతీయ క్రికెట్‌లో క్రమంగా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయని రహానే పేర్కొన్నాడు. అక్కడి యువ ఆటగాళ్లలో నేర్చుకోవాలనే తపన కనిపిస్తోందని చెప్పాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ స్థానిక ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ద్వారా స్థానిక క్రికెటర్లు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందని వివరించాడు.

## రహానేపై స్టీవ్ వా ప్రశంసలు

ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ యజమాని, చీఫ్ క్రికెట్ ఆఫీసర్ స్టీవ్ వా కూడా రహానేపై ప్రశంసలు కురిపించాడు. రహానే ఆదర్శవంతమైన ప్రొఫెషనల్ క్రికెటర్ అని, అతనిలో నైపుణ్యం, సహనం, నాయకత్వ లక్షణాలతో పాటు వినయం కూడా ఉన్నాయని కొనియాడాడు. తీవ్రమైన ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండే రహానే స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ఫ్రాంచైజీ సీఈవో టిమ్ థామస్ సైతం రహానే చేరికను క్లబ్ చరిత్రలో కీలక ఘట్టంగా అభివర్ణించాడు. ఇది కేవలం ఒక స్టార్ ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం మాత్రమే కాదని, భవిష్యత్తులో జట్టు సంస్కృతి, ప్రమాణాలను నిర్మించడంలో ఉపయోగపడే కీలక నిర్ణయమని పేర్కొన్నాడు.

## ఆగస్టు 26 నుంచి కొత్త ఇన్నింగ్స్

యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఐర్లాండ్‌లోని డబ్లిన్, నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరాలు మ్యాచ్‌లకు వేదిక కానున్నాయి. ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున రహానే బరిలోకి దిగనున్నాడు. అతని సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవం జట్టుకు అదనపు బలంగా మారుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది.

## 195 మ్యాచ్‌లు.. 8,414 పరుగులు

భారత్ తరఫున రహానే 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 195 మ్యాచ్‌ల్లో 8,414 పరుగులు సాధించాడు. అతని ఖాతాలో 15 సెంచరీలు, 51 అర్ధ సెంచరీలు ఉన్నాయి. జూలై 30న అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు భారత దేశీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికిన రహానేకు ఇప్పుడు విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌లలో కొత్త ప్రయాణం మొదలవుతోంది. భారత జెర్సీలో సుదీర్ఘ ఇన్నింగ్స్ ముగించిన రహానే.. ఇప్పుడు యూరప్ గడ్డపై ఎలాంటి ముద్ర వేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.



# 'బిగ్‌బాస్'లో సాధనా నాయుడు!?

## పదో సీజన్‌లో సోషల్ మీడియా బ్యూటీ సందడి?

## హౌస్‌లోకి ఎంట్రీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందంటూ ప్రచారం

## పేరు బయటకు రావడంతో నెట్టింట పెరిగిన ఆసక్తి

## 'దశావతారం' కాన్సెప్ట్‌తో పదింతల వినోదానికి రంగం సిద్ధం

బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షోగా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'బిగ్‌బాస్' పదో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం ఇప్పుడు 'బిగ్‌బాస్ 10: దశావతారం' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త సీజన్‌లో పాల్గొనే కంటెస్టెంట్లపై రోజుకో పేరు తెరపైకి వస్తుండగా తాజాగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సాధనా నాయుడు పేరు జోరుగా వినిపిస్తోంది.

### సాధనా ఎంట్రీ ఖాయమేనా?

బిగ్‌బాస్ పదో సీజన్ కోసం నిర్వాహకులు సాధనా నాయుడిని సంప్రదించారని, ఆమె కూడా హౌస్‌లోకి వెళ్లేందుకు సానుకూలంగా స్పందించిందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సాగుతోంది. అయితే ఆమె ఎంపికపై నిర్వాహకుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సాధనా నాయుడు సామాజిక మాధ్యమాల్లో తనదైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ట్రెండింగ్ రీల్స్, స్టైలిష్ ఫొటోషూట్లతో డిజిటల్ వేదికల్లో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు.

### నెట్టింట ఒక్కసారిగా క్రేజ్

బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా సాధనా నాయుడు పేరు ప్రచారంలోకి రావడంతో ఆమె సామాజిక మాధ్యమ ఖాతాలపై నెటిజన్ల ఆసక్తి పెరిగింది. ఆమె హౌస్‌లోకి అడుగుపెడితే తనదైన స్టైల్, వ్యక్తిత్వంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ప్రతి సీజన్‌లోనూ సినిమా, టెలివిజన్, సామాజిక మాధ్యమాలు సహా వివిధ రంగాలకు చెందిన వారిని హౌస్‌లోకి తీసుకొచ్చే బిగ్‌బాస్ నిర్వాహకులు ఈసారి ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సాధనా నాయుడు నిజంగానే పదో సీజన్‌లో అడుగుపెడతారా? లేక ఆమె పేరు కూడా ఊహాగానాలకే పరిమితమవుతుందా? అన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.





# అమ్మాయిలూ అవకాశాలంటూ నమ్మి రావొద్దు

- సినీ అవకాశాల పేరుతో వేధింపులంటూ యువతి ఆవేదన
- మూడుసార్లు చేదు అనుభవం ఎదురైందని వెల్లడి
- సీరియల్.. సినిమా.. ఫోక్‌సాంగ్.. ఎక్కడికెళ్లినా అదే పరిస్థితంటూ ఆరోపణ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో
- క్యాస్టింగ్ కౌచ్‌పై మరోసారి చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 7:** వెండితెరపై వెలిగిపోవాలని.. నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఎన్నో కలలతో సినీ పరిశ్రమ వైపు అడుగులు వేసే యువతులకు అవకాశాల పేరుతో వేధింపులు ఎదురవుతున్నాయంటూ ఓ సామాజిక మాధ్యమ ప్రభావశీలి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సీరియళ్లు, సినిమాలు, ఫోక్‌సాంగ్స్‌లో అవకాశాలు ఇప్పిస్తామంటూ తనను సంప్రదించిన సందర్భాల్లో మూడుసార్లు చేదు అనుభవాలు ఎదురయ్యాయని ఆమె ఆరోపించింది. తనలాంటి పరిస్థితి మరెవరికీ ఎదురుకాకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో తన ఖాతాలను చూసి సినిమాలు, సీరియళ్లు, షార్ట్‌ఫిల్మ్స్, ఫోక్‌సాంగ్స్‌లో అవకాశాలు ఇస్తామని ఎవరైనా సంప్రదిస్తే గుడ్డిగా నమ్మి వెళ్లవద్దని యువతులకు ఆమె సూచించింది. తాను తొలుత సీరియల్ అవకాశం వచ్చిందని వెళ్లగా అక్కడ అనుచిత ప్రతిపాదన ఎదురైందని, దీంతో వెనక్కి వచ్చేశానని పేర్కొంది. ఆ తర్వాత సినిమా అవకాశం విషయంలోనూ ఇదే తరహా అనుభవం ఎదురైందని ఆరోపించింది. తాజాగా ఫోక్‌సాంగ్‌లో అవకాశం ఇస్తామని పిలవడంతో వెళ్లానని, అక్కడ కూడా తనకు చేదు అనుభవమే ఎదురైందని వాపోయింది. ప్రతిభను చూసి అవకాశాలు ఇస్తారని ఆశపడిన తనకు వరుస అనుభవాలతో తీవ్ర నిరాశ ఎదురైందని తెలిపింది. అవకాశాల పేరుతో యువతులను లొంగదీసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే తనకు ఎదురైన అనుభవాల నేపథ్యంలో భావోద్వేగంతో మాట్లాడిన యువతి.. సినీ రంగంలో ఎదిగిన మహిళలందరిపైనా సాధారణీకరించేలా కొన్ని వ్యాఖ్యలు చేసింది. ప్రతిభతో ఎదిగిన నటీమణుల విజయాలను ప్రశ్నించేలా ఉన్న ఈ వ్యాఖ్యలకు ఆధారాలను మాత్రం ఆమె వెల్లడించలేదు. దీంతో ఆమె వ్యక్తిగత అనుభవాలపై చేసిన ఆరోపణలను మొత్తం చిత్ర పరిశ్రమకు ఆపాదించడం సరికాదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ భారతీయ చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. 'మీటూ' ఉద్యమ సమయంలో పలువురు నటీమణులు, సినీరంగ మహిళలు తమకు ఎదురైనట్లు చెప్పిన వేధింపులను బహిరంగంగా వెల్లడించారు. అవకాశాల పేరుతో మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అప్పటినుంచే డిమాండ్లు వినిపిస్తున్నాయి. తాజా వీడియో మరోసారి అదే అంశాన్ని తెరపైకి తెచ్చింది. సినీ అవకాశాల కోసం వచ్చే యువతులు వ్యక్తులు, సంస్థల విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని, అధికారిక ఆడిషన్లు, నిర్మాణ సంస్థల ద్వారానే అవకాశాలను పరిశీలించాలని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. అవకాశాల పేరుతో ఎవరైనా అనుచిత ప్రతిపాదనలు లేదా వేధింపులకు పాల్పడితే సంబంధిత అధికారులను ఆశ్రయించాలని పేర్కొంటున్నాయి.

# 'కొరియన్ కనకరాజు'కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com